J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 20

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 10 12.8.2022, శుక్రవారం వెల : రూ. 5 /-
వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## జయహో భారత్



బ్రిటీష్ ముష్కరుల ఇనుప సంకెళ్ల నుండి మన దేశానికి బంధవిముక్తి లభించి డెబ్బైఐదేళ్లు. భారతీయులు స్వేచ్ఛా వాయువులు పీల్చ సాగి డెబ్బైఐదేళ్లు. వందేమాతరం అంటూ నిర్భయంగా నినదించసాగి డెబ్బైఐదేళ్లు. నేనూ.. నా దేశం అంటూ సగర్వంగా చెప్పుకోవడం మొదలుపెట్టి డెబ్బైఐదేళ్లు. ఎందరో మహాత్ముల త్యాగాలతో మువ్వన్నెల జెండా ఆకాశమే హద్దుగా రెపరెపలాడి ఏడున్నర దశాబ్దాలు.

పరాయిదేశ పెత్తనంపై తిరుగుబాటు చేసి వారిని తరిమితరిమి కొట్టి ఈ స్వాతంత్ర్యాన్ని మనం సాధించుకున్నాం. ఇప్పుడు సంపూర్ణ స్వతంత్ర దేశంలో మనం బ్రతుకుతున్నాం. ఎంతోమంది ప్రాణత్యాగాలతో లభించిన స్వేచ్ఛా ప్రపంచంలో ఇప్పుడు మనం విహరిస్తున్నాం.

ఈ ఏడున్నర దశాబ్దాల కాలంలో సమాజంలో పెనుమార్పులు సంతరించుకున్నాయి. టైపురైటర్ల యుగం నుండి కంప్యూటర్ల కాలానికి వచ్చేశాం. సమాచార వ్యవస్థ కొత్త పుంతలు తొక్కుతోంది. పోస్టుకార్డు మాయమై సెల్‌ఫోను అవతరించింది. మిణుకు మిణుకుమనే లాంతర్ల వెలుగు నుండి మిరుమిట్లు గొలిపే ఎల్.ఈ.డి కాంతులలో వెలిగిపోతున్నాం. అప్పటికీ ఇప్పటికీ జనజీవన స్వరూపమే మారిపోయింది.

బ్రిటీష్ వారి అజమాయిషీ నుండి మన బ్రతుకులు రాజకీయ నాయకుల పాలనలోకి వెళ్లిపోయాయి. మనల్ని పరిపాలించేవాళ్లని మనమే ఎన్నుకుని మన జీవితాలు వాళ్ల చేతుల్లో పెడుతున్నాం. వాళ్ళు సరి కాదని వీళ్లకి, వీళ్ల పాలన బాగాలేదని వాళ్లకి మనల్ని మనం తాకట్టుపెట్టి బ్రతుకుతున్నాం. సుదీర్ఘ పోరాటం తరువాత సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని మనం సద్వినియోగం చేసుకుంటున్నామా అన్న అయోమయానికి కూడా ఒక్కోసారి గురవుతున్నాం. మనకి నిజంగా స్వాతంత్ర్యం వచ్చిందా? మనం స్వతంత్ర భారతదేశంలోనే జీవిస్తున్నామా?? మన బ్రతుకులు మన చేతుల్లోనే ఉన్నాయా??? అన్న ప్రశ్నలకి సమాధానం వెతుక్కుంటూ, రేపు ఆగస్టు 15న స్వాతంత్ర్య వజ్రోత్సవం జరుపుకోబోతున్నాం.

"హర్ ఘర్ పర్ తిరంగా" అంటూ ప్రతి ఇంటిపైనా మన జెండా ఎగురవేయమన్న పాలకుల పిలుపుతో పులకించిపోతున్నాం. భవిష్యత్తుపై కోటి ఆశలతో మువ్వన్నెల జెండాని సిద్ధం చేసుకుంటున్నాం. ఈ వజ్రోత్సవానికి సాక్షీభూతంగా నిలచిన 130 కోట్ల భారతీయులలో నేనూ ఒకడినైనందుకు గర్విస్తున్నాను. ఈ మహోన్నత అమృతోత్సవంలో 'లాయర్'ను కూడా భాగస్వామిని చేయడానికి సంతోషిస్తూ... 'వజ్రోత్సవ భారతికి అక్షర హారతి'గా, 'లాయర్' పాఠకులకు ఓ చిరు కానుకగా నాలుగుపేజీల అనుబంధాన్ని అందిస్తున్నాం.

సంపూర్ణ స్వతంత్ర భారత్ కోసం పోరాడి తమ జీవితాలు త్యాగం చేసిన వారు ఎంతో మంది ఉన్నారు. వారిలో నెల్లూరీయులు కూడా ఉన్నారు. ఈ సంతోష సంరంభ సమయంలో వారందరినీ స్మరించుకుంటూ... వజ్రోత్సవ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతోంది మన 'లాయర్'.

తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు)

## 'నవరత్నాలు' నడవాలన్నా ప్రభుత్వం నిలవాలన్నా వైసిపి మళ్ళీ గెలవాలన్నా మద్యంతోనే సాధ్యం

"బటన్ నొక్కి ప్రజల ఖాతాలలో డబ్బు జమచేసే కార్యక్రమం కొనసాగాలంటే మద్యం ఏరులై పారాల్సిందే అంటున్నారు విశ్లేషకులు. అలా కాకుండా చెప్పిన మాటకు కట్టుబడి ప్రభుత్వం సంపూర్ణ మద్యపాన నిషేధం విధిస్తే, పథకాల బటన్‌తో పాటు డబ్బులు ప్రింటు చేసే మిషన్ బటన్ కూడా నొక్కాల్సి వస్తుందన్నది వారి భావన".

"మా పార్టీ అధికారంలోకి రావడంతోనే బెల్టు షాపులన్నీ మూసేస్తాం. విడతల వారీగా తగ్గించుకుంటూ వచ్చి సంపూర్ణ మద్యపాన నిషేదాన్ని అమలు చేస్తాం"... ఇదీ సీఎం జగన్ మహిళలకు ఇచ్చిన హామీ. ఇచ్చిన మాటకు తగ్గట్లుగానే తమ ప్రభుత్వం ఏర్పడగానే బెల్టుషాపులపై బెల్టు తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన దుకాణాల్లో తప్ప

5 లో




# విలీనంతో విద్యార్థులకు కష్టాలు

**- ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం**



రాష్ట్రంలో 3,4,5 తరగతులు ఉన్నత పాఠశాలల్లో విలీనం కావడంతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు చాలావరకు మూతపడుతున్నాయని, విలీనంతో చిన్న తరగతుల విద్యార్థులకు కష్టాలు వచ్చిపడ్డాయని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 8న ఆయన మనుబోలు, బద్దేవోలు గ్రామాల్లో ఉన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో విలీనం విషయమై చర్చించారు. విలీనం ప్రక్రియ మొదలైనప్పటినుంచి అనేకమంది ప్రభుత్వ పాఠశాలల వారు ప్రైవేట్ పాఠశాలలకు తరలి వెళ్తున్నారని, చిన్నపిల్లలు ఉన్నత పాఠశాలల విద్యార్థుల మధ్యలో ఉండలేరని అన్నారు. విలీనంతో ఉపాధ్యాయులు కూడా సమస్యలు ఎదుర్కొంటున్నారని, తల్లితండ్రులు తమ పిల్లలను ఉన్నతపాఠశాలలకు పంపలేక బాధపడుతున్నారని చెప్పారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి విలీనం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు అనిల్‌కుమార్, మోహన్‌రావు, శ్రీకాంత్,ర శ్రీనివాసులు పాల్గొన్నారు.

# నందీశ్వరుని విగ్రహ ప్రతిష్ట

పొదలకూరులోని పురాతనమైన శివాలయంలో ఈనెల 7న నందీశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్‌కుమార్, శివకుమార్ ఆధ్వర్యంలో ఆలయంలో హోమాలు చేపట్టి, మహాకుంభాభిషేకాలు నిర్వహించారు. నందీశ్వరుని విగ్రహ దాతలు తన్నీరు రమణయ్య, భారతి, తన్నీరు చక్రధర్, దివ్యశ్రీలు ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేకపూజలు చేసిన అనంతరం ఆలయ అర్చకులు దాతలను ఆశీర్వదించారు. ఆలయ ధర్మకర్తలమండలి ఛైర్మెన్, సభ్యులు పర్యవేక్షించారు.

# ముువ్వన్నెల జండా

భారతదేశ స్వాతంత్ర్యానికి
మువ్వన్నెల జండా
సౌభాగ్యమై నిలిచింది
లౌకిక రాజ్యంలో విభిన్న అంశాలలో
వ్యతిరేకతలు ఎన్నున్నా
విభేదాలు రానే రావని
స్పష్టీకరించెను మన రాజ్యాంగం.
అలనాటి పోరాటంలో గాంధీ గారి దీక్ష
గ్రామ స్వరాజ్యమే ఏకైక లక్ష్యమై
పురోభివృద్ధిని సాధించాలన్నారు.
విదేశాంగ విదానాలలో
ప్రభుత్వ పాలకులు స్నేహ సుహృద్
భావాలలో మేటిగ నిలిచారు.
అఖండ ఖ్యాతిని గడియించి
మువ్వన్నెల మన జెండాకు
ఘనకీర్తిని ఆర్జించారు.
భారత దేశ రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ
పథకాలు అమలు చేయగా
చేయూత నందించి
వివిధ రంగాల అభివృద్ధికై
ముందంజ వేశారు.
స్వాతంత్ర్య దేశ పోరాట ఫలితాలు
అందరికీ దక్కాలన్న తలంపుతో
ప్రజాస్వామ్యానికి చిహ్నమైన
మువ్వన్నెల జండా
భారతదేశం అంతటా ఇంటింటా
ఎగరాలన్న భావాన్ని వ్యక్తీకరించారు.

**దూబగుంట రామకృష్ణ**
తిరుపతి. 965 202 1126

# ఇస్కాన్‌లో వేడుకగా.. శ్రీకృష్ణాష్టమి

## అలరించిన చిన్నారుల వేషధారణలు



శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 7న నెల్లూరు నగరంలోని ఇస్కాన్ మందిరంలో స్వామివార్లకు విశేష పూజలు జరిగాయి. అనంతరం చిన్నారులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, సుభద్ర, బలరాముడు తదితర దేవతామూర్తుల వేషధారణలతో అందరినీ అలరించారు. ఇస్కాన్ నిర్వాహకులు ఈ సందర్భంగా విద్యార్థులకు ఫ్యాన్సీడ్రస్, డ్రాయింగ్, భగవద్గీత శ్లోకాల పోటీలు, దీపాలంకరణ తదితర పోటీలు నిర్వహించారు. చిన్నారులకు చిత్రలేఖనం, శ్లోకాలు, పద్యకంఠస్థ పోటీలు పెట్టారు. దాదాపు రెండువేల మంది దాకా విద్యార్థులు, చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొనడం విశేషం. కలెక్టర్ సతీమణి కిరణ్మయి ఈ వేడుకలకు హాజరై విజేతలను అభినందించారు. ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు డా.శుకదేవస్వామి ఆమెను ఘనంగా సత్కరించారు.

## కలెక్టర్ తనయుడు.. భగవద్గీత పోటీల్లో ఫస్ట్

భగవద్గీత పఠన పోటీల్లో జూనియర్స్ విభాగంలో కలెక్టర్ చక్రధర్‌బాబు తనయుడు భార్గవ్ అభిరామ్ ప్రథమస్థానం సాధించాడు. సీనియర్స్‌లో పి. హేమిత ప్రథమబహుమతి సాధించింది. అదేవిధంగా దేవతామూర్తుల వేషధారణ పోటీల్లో రెయిన్‌బో పాఠశాల ప్లేక్లాస్ విద్యార్థి ఎం.వేదాంత చైతన్య, రంగులు వేయడంలో జూనియర్స్ విభాగంలో కోవూరులోని రత్నం పాఠశాలకు చెందిన 3వ తరగతి విద్యార్థిని ఎం.కీర్తిప్రియ, రంగులు వేయడంలో అక్షర విద్యాలయం అయిదోతరగతి విద్యార్థిని పివిఎన్ శ్రీకౌస్తుభ, సీనియర్స్ విభాగంలో ఫిజాపర్వీన్ సయ్యద్, ఎస్.మణికంఠసాయి, వెంకటసాధిక్, జి.చరణ్‌శివమాలిక్, కె.శివప్రీతి బహుమతులు సాధించారని ఇస్కాన్ అధ్యక్షులు శుకదేవస్వామి తెలిపారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో 25 మంది బహుమతులు పొందారని, వారికి ఈనెల 19న శ్రీకృష్ణజన్మాష్టమి రోజున బహుమతులు అందజేస్తామని వివరించారు.

# పుదూరు గురుకుల బాలికల దేశభక్తి ర్యాలీ



ఆజాది కా అమృత మహోత్సవ్‌లో భాగంగా ఇటీవల నాయుడుపేట సమీపంలోని పుదూరులోని డా. అంబేద్కర్ బాలికల గురుకులంలో బాలికలంతా దేశభక్తి నినాదాలు చేస్తూ జాతీయపతాకాలతో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజుల సుభద్రాదేవి పాల్గొని దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్యయోధుల త్యాగాలను వివరించారు. అనంతరం వక్తృత్వం, చిత్రలేఖనంలలో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ఇచ్చారు. గురుకులం వైస్‌ప్రిన్స్‌పాల్ తన్నీరు శశికళ, శోభ, సుమమ్మ, దాక్షాయణి, గీత, సునీత, భూలక్ష్మి, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సవరణ బిల్లు.. ఆలోచన విరమించుకోవాలి




కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టదలచుకున్న 2022-విద్యుత్ సవరణ బిల్లు వద్దనే వద్దని, ఆ ఆలోచన విరమించుకోవాలని నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈనెల 8న నెల్లూరులోని విద్యుత్‌భవన్ వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో ఆ బిల్లు వద్దంటూ విద్యుత్ ఉద్యోగుల జెఏసి నేతలు నిరసన చేపట్టారు. విద్యుత్ సవరణ బిల్లు వల్ల విద్యుత్ ఉద్యోగులకే కాకుండా ప్రజలకు కూడా ఇబ్బందులు ఉంటాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని బిల్లును ఉపసంహరించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసి నాయకుడు అల్తాఫ్, జిల్లా జేఏసి నాయకులు శ్రీనివాసులు, భాస్కర్, పెంచలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పంటపాళెం పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

ముత్తుకూరు మండలంలోని పంటపాళెంలో కొలువై ఉన్న పోలేరమ్మ అమ్మవారికి గ్రామస్తులు ఈనెల 7న ప్రత్యేకపూజలు చేశారు. పోలేరమ్మ విగ్రహ ప్రతిష్ఠ జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా పెద్దసంఖ్యలో గ్రామప్రజలు ఆలయం వద్దకు వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలుచేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

## విఎస్‌యు ఆధ్వర్యంలో

# 500 అడుగుల జెండాతో భారీ ర్యాలీ

## దేశం గర్వపడేలా జాతీయజెండాలు రెపరెపలాడించాలన్న వీసీ సుందరవల్లి



ఆజాదీ కా అమృత్ మహోత్సవాల సందర్భంగా దేశం గర్వపడేలా ప్రతి ఇంటిమీద జాతీయజెండాలు రెపరెపలాడించేందుకు అందరూ ముందుకు రావాలని నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు) ఉపకులపతి ఆచార్య జి.ఎం సుందరవల్లి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఈనెల 7న విఎస్‌యులోని ఎన్ఎస్ఎస్ విభాగం వారి సహకారంతో 500 అడుగుల జాతీయ జెండాతో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి నినాదాలు చేస్తూ విద్యార్థులు, అధ్యాపకులు పెద్దఎత్తున ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశస్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేసిన స్వాతంత్ర్యయోధులను ఏనాటికీ విస్మరించరాదని, నేటి యువత ఆ మహనీయులను ఆదర్శంగా తీసుకుని వారి ఆశయాల బాటలో నడవాలన్నారు. పరాయిపాలనతో బానిసత్వం నుంచి విముక్తి పొందిన దేశానికి అవినీతి వంటి ప్రగతి నిరోధకాలనుంచి కూడా విముక్తి కలిగించేందుకు యువత నడుం బిగించాలన్నారు. విఎస్‌యు రిజిస్ట్రార్ డా.పి. రామచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య విజయానంద్‌బాబు, డీన్ డా.సి.హెచ్ విజయ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.వై.విజయ, డివిఇఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాడ్మింటన్ విజేతలకు బహుమతులు



ఇటీవల జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలైన వారికి ఏపి బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, 'నుడా' ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్ ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈనెల 7న నెల్లూరులోని 'నుడా' కార్యాలయంలో ఆయన బ్యాడ్మింటన్ క్రీడాకరులతో మాట్లాడుతూ అందరూ రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు తేవాలన్నారు. పతకాలు సాధించినవారికి అసోసియేషన్ ఆధ్వర్యంలో మరిన్ని ప్రోత్సాహకాలు అందజేస్తామని చెప్పారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి నిమ్మల వీరవెంకటేశ్వర్లు, సభ్యులు మద్దిపాటి ప్రసాద్‌రావు, గంగపట్నం రామ్మోహన్, వరప్రసాద్‌తో పాటు జాలీ బ్యాడ్మింటన్ క్లబ్ అధ్యక్షుడు సూర్యనారాయణ, సీనియర్ క్రీడాకారుడు ప్రసన్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వెల్లంటిలో..40 అడుగుల జెండాతో ప్రదర్శన



ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఈనెల 8న నెల్లూరురూరల్ మండలం పాతవెల్లంటి గ్రామంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు 40 అడుగుల భారీ జాతీయపతాకాన్ని ప్రదర్శించారు. గ్రామంలోని ప్రధానవీధుల్లో ర్యాలీ నిర్వహించి దేశనాయకులను తలచుకుంటూ దేశభక్తి నినాదాలు చేశారు. హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటా భారత కీర్తిపతాకం రెపరెపలాడాలన్నారు. అనంతరం వారు నిర్వహించిన స్వాతంత్ర్యయోధుల వేషధారణలు, నాటక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కొత్తూరు జడ్పీ ఉన్నతపాఠశాల హెడ్మాస్టర్ అమూల్యకుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపిడిఓ వసుమతి, సర్పంచ్‌లు రాధమ్మ, లక్ష్మమ్మ, పాఠశాల హెడ్మాస్టర్ ఎం.వెంకటేశ్వర్లు, కమిటీ ఛైర్మెన్ వెంకటరమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కొత్త కార్యవర్గం ప్రమాణస్వీకారం

ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కొత్తకార్యవర్గ ప్రమాణస్వీకారం ఈనెల 8న నెల్లూరులో జరిగింది. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా వాసు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అధ్యక్షునిగా గుండ్లపల్లి శ్రీధర్, కార్యదర్శిగా చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారిగా అద్దేపల్లి సుబ్బారావుతో పాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. ఆర్యవైశ్య ప్రముఖులు కెవి చలమయ్య, పి.శ్రీరాములు, సుంకు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ ప్రయోజనాలే అందరికీ పరమావధి కావాలి



- వీడ్కోలు సమావేశంలో ఎంపీలు, దేశ ప్రజలకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఉద్బోధ
- ప్రధానమంత్రి, లోక్‌సభ స్పీకర్ సహా హాజరైన కేంద్రమంత్రులు
- ఉపరాష్ట్రపతితో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని గుర్తుచేసుకున్న ప్రధాని

***భారత ఉపరాష్ట్రపతిగా అద్వితీయమైన సేవలందించిన మన వెంకయ్యనాయుడు ఆగస్టు 10న పదవీ విరమణను పురస్కరించుకుని ఆయన గౌరవార్థం ఈనెల 8న ఢిల్లీలో నిర్వహించిన సమావేశం..ప్రధానమంత్రి నరేంద్రమోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు అనేకమంది ఎంపీలు, రాజకీయ ప్రముఖుల మధ్య ఎంతో ఆత్మీయంగా.. ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర నాయకులు ఉప రాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు చేసిన సేవలను కొనియాడారు. వెంకయ్యనాయుడు ఎంపీలు, ప్రజలనుద్దేశించి తనదైన శైలిలో చక్కటి ప్రసంగం చేసి అందరి కరతాళధ్వనులందుకున్నారు.***



ఢిల్లీ పార్లమెంటు భవనంలో జరిగిన ఆ సమావేశంలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ..రాజకీయంగా, సిద్ధాంతపరంగా ఎన్ని విభేదాలున్నా పార్ల మెంటు సభ్యులకు జాతీయ ప్రయోజనాలే పరమావధి కావాలని స్పష్టం చేశారు. కుల, మత, లింగ, ప్రాంత విభేదాలకు అతీతంగా భారతదేశమే ప్రథమం (నేషన్ ఫస్ట్) భావన ప్రతి ఒక్కరిలో ఉన్నప్పుడే పార్లమెంటులో ప్రజోపయోగ చట్టాలపై చక్కటి చర్చలు జరిగేందుకు వీలవుతుందన్నారు. అప్పుడే మన రాజ్యాంగ నిర్మాతలు, నాటి నేతలు కలలుగన్న ప్రజాస్వామ్య భారత్ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. అయిదేళ్లపాటు భారతదేశ రెండో అతిపెద్ద రాజ్యాంగ హోదాలో రాజ్యసభ చైర్మన్‌గా పనిచేయడం తనకెంతో సంతృప్తినిచ్చిందన్నారు. సభా కార్యక్రమాల నిర్వహణను విజయవంతంగా చేపట్టడంలో అన్ని పార్టీలవారు సహకరించారంటూ వారందరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. సభా మర్యాదలు కాపాడటం, సభ్యులకు గౌరవం కల్పించేందుకే చాలాసార్లు కఠినంగా వ్యవహరించాల్సి వచ్చిందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. భారతీయతకు, మన సంస్కృతి, సంప్రదాయాలకే తానెప్పుడూ పెద్దపీట వేశానని, 'దేశమే ప్రథమం, తర్వాతే వ్యక్తిగతం' అన్న నినాదాన్ని పాటించానని అన్నారు. ప్రతి ఒక్కరూ దేశ ప్రయోజనాల విషయంలో రాజీ పడకూడదని ఉపరాష్ట్రపతి సూచించారు. నిరంతరం ప్రజలతో మమేకం కావడం ద్వారా చాలా విషయాలు తెలుస్తాయని, తన రాజకీయజీవితం ప్రారంభం నుంచీ యువత, మహిళలు, శాస్త్రవేత్తలు, వైద్యులు, వివిధ రంగాల నిపుణులతో నిరంతరం మాట్లాడుతూ వారి అభిప్రాయాలను తెలుసుకోవడంతో ఆయా విషయాలపై లోతైన అవగాహన పెంచుకునేందుకు ఉపయోగపడిందన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమం జరుపుకుంటున్న తరుణంలో మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తుకు తెచ్చుకుని వాటి ప్రేరణతో నవభారత నిర్మాణానికి సరికొత్త ఉత్సాహంతో ముందుకెళ్లాలని (మిగతా 14వ పేజీలో)

## అసలైన ప్రజానాయకుడు వెంకయ్య - ప్రశంసించిన ప్రధాని మోడీ



తాను కార్యకర్తగా ఉన్నప్పటినుంచీ వెంకయ్యనాయుడుతో ఎంతో అనుబంధం ఉందని, ఎప్పుడు ఏ సమస్య వచ్చినా పరిష్కారంతో ఆయన ముందుండేవారని, వారి సూచనలు తనకు మార్గదర్శనం చేశాయని ఈ సమావేశంలో పాల్గొన్న ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడుతో తనకున్న అనుభవాలను ప్రధానమంత్రి ప్రస్తావించారు. కరోనా సమయంలో కూడా తన రాజకీయ జీవితంలో తారసపడిన దాదాపు ప్రతి ఒక్కరికీ ఉపరాష్ట్రపతి ఫోన్ చేసి వారి ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారని, ఇది అసలైన ప్రజానాయకుడి లక్షణమని ప్రధాని పేర్కొన్నారు. మాతృభాషల పరిరక్షణ కోసం వారు చేసిన కృషిని కొనసాగిస్తామన్నారు. మాతృభాష పట్ల వారికున్న అభిరుచి అభినందనీయం, ఆదర్శనీయమని, కొనియాడారు. భారతదేశం అజాదీకా అమృత్ మహోత్సవ్ జరుపుకుంటున్న సమయంలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి స్వాతంత్ర్య భారతంలో పుట్టినవారు కావడం, వారంతా సామాన్య కుటుంబాల నుంచి రావడం గర్వ కారణమన్నారు. మాటల మాంత్రికుడిగా వెంకయ్యనాయుడు ప్రయోగించే పద జాలం, ఏకవాక్య ప్రయోగాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమేనన్నారు. వారి మార్గదర్శనంలో పనిచేసే అవకాశం తనకు దక్కిందని, అందుకు గర్వపడుతున్నానని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతిగా వెంకయ్యనాయుడు అయిదేళ్ల పదవీకాలంపై రూపొందించిన పుస్తకాన్ని ప్రధాని ఆవిష్కరించారు.


భారత స్వాతంత్ర్య వజ్రోత్సవం సందర్భంగా

"ఇంటింటా మన జెండా
ఆనంద సంరంభంగా
ఎగురవేద్దాం ఘనంగా"

75వ
స్వాతంత్ర్య దినోత్సవ
శుభాకాంక్షలతో...



డాక్టర్ పొంగూరు నారాయణ
మాజీ మంత్రి
వ్యవస్థాపక చైర్మెన్
నారాయణ విద్యాసంస్థలు
నారాయణ హాస్పిటల్స్

లాయర్
ఆగస్టు 12, 2022

# మట్టిలో మాణిక్యాలను గుర్తించాలి

'మనవాడు తలచుకుంటే ఏమైనా చేస్తాడు.. ఎంతటి కష్టమైనా సరే సాధిస్తాడు'.. అంటూ మెచ్చుకుంటుంటారు మనింట్లో పెద్దలు ఎప్పుడైనా ఏదైనా విజయం సాధించినప్పుడు. ఇప్పుడు కూడా అలాంటి మాటే అనవచ్చు..మన క్రీడాకారుల సంబరం చూస్తుంటే. అయినా అదేమీ చిన్నవిషయం కాదు.. ప్రపంచమంతా కళ్లింతవి చేసుకుని చూస్తున్న కామన్వెల్త్ క్రీడా పోటీల్లో గెలవడం అంటే మాటలతో కాదు. ఎంతో ప్రతిభా పాటవాలుండాలి.. క్రీడా నైపుణ్యం ఉండాలి. మనవాళ్లు ఇటీవల వాటిని పుష్కలంగానే సాధించుకుంటున్నారు. దీంతో పతకాలు వెల్లువెత్తుతున్నాయి. క్రీడల్లో మెరికల్లా తయారుకావాలంటే ఎంతో శిక్షణ, క్రమశిక్షణ ఉండాలి. అందుకు పడే శ్రమ ఇంతని చెప్పలేం!...ఇక విజయాలు సాధించేదిశగా పరుగులెత్తాలంటే అన్నివిధాలా వసతులుండాలి. అన్నిటికీమించి 'నువ్వు సాధిస్తావ్' అంటూ ప్రోత్సహించేవారు వెనకాల ఉండాలి. మనవాళ్ళకి ప్రారంభస్థాయిలో ఇలాంటి సహకారం ఇటు స్థానికంగా కానీ, అటు ప్రభుత్వాల పరంగా కానీ అంతగా లేకున్నా పట్టుదలతో పైకొచ్చినవారే అందరూ. కొందరు సామాన్య స్థాయి నుంచి, మరికొందరు ఇంకా పేదతనం నుంచి క్రీడారంగంలోకి వచ్చినా, జీవితంలో గెలుపే లక్ష్యంగా రాణిస్తున్నారు కనుకనే ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు క్రీడాజగత్తులో భారత్ పెద్దదేశాల వరుస లోకి వచ్చి సగర్వంగా పతకాల పతాకాన్ని ఎగురవేస్తోంది. మొన్ననే ఇంగ్లాండ్‌లోని బర్మింగ్‌హామ్‌లో ముగిసిన కామన్వెల్ క్రీడల్లో 215 మంది భారత క్రీడాకారులు బర్మింగ్‌హామ్‌కు వెళ్లారు. ఆకాశమే హద్దుగా ఆటల్లో తమ నైపుణ్యమంతా కుమ్మరించారు. అనుకున్నది సాధించారు. మన అథ్లెట్లకు 61 పతకాలు రావడం, అందులో 22 స్వర్ణపతకాలు, 16 రజత పతకాలు, 23 కాంశ్యపతకాలు కావడం ఎంతో సంతోషించ దగ్గ విషయం. మొత్తంగా భారత్‌కు ఇదో గొప్ప విజయం కూడా. ఆస్ట్రేలియా 178 పతకాలు, ఇంగ్లండ్ 176 పతకాలు, కెనడా 92 పతకాలు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో ఉంటే, భారత్ ఆ వరుసలో చతుర్ధస్థానం కైవసం చేసుకోవడం గొప్ప విశేషమే. ఎందుకంటే ఆదేశాల్లో ఉన్నంత క్రీడాస్ఫూర్తిని మనవారు ఇక్కడెవరిస్తున్నారు?..జావెలిన్‌త్రోలో ఒలింపిక్‌లో విజయం ఒడిసిపట్టిన నీరజ్‌చోప్రా గాయపడడంతో ఈ పోటీలకు రాలేకపోవడం మన జట్టుకు కొంత లోటే. అయినా ఎవరూ తగ్గకుండా విజయాల బాటలోనే నడిచారు. చివరి రోజు కూడా భారత్ క్రీడాకారులు అదరహో అనిపించారు. 4 స్వర్ణపతకాలు సాధించి తిరుగులేని విజయాలు సాధించారు. బ్యాడ్మింటన్‌లో కేక పుట్టించారు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్య సేన్, డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజు, చిరాగ్‌శెట్టి, టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో శరత్‌కమల్ పసిడిపతకాలు సాధించి ఔరా అనిపించారు. మన తెలుగుబిడ్డ, అగ్రశ్రేణి షట్లర్ పి.వి.సింధు స్వర్ణం సాధించి తన సత్తాచాటుకుంది. బ్మాడ్మింటన్‌లో సింధు ప్రావీణ్యం అద్భుతం. పురుషుల హాకీ జట్టు రజత పతకం కైవసం చేసుకుంది. అదేవిధంగా బ్యాడ్మింటన్‌లో సాత్విక్ సాయిరాజ్, కిడాంబి శ్రీకాంత్‌ల ఆట మైమరపించింది. ఈ ముగ్గురితో పాటు బాక్సింగ్‌లో నిఖత్ జరీన్, హుస్సాముద్దీన్, టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో శ్రీజ..శరత్‌కమల ద్వయం స్వర్ణం సాధించింది. వీరంతా తెలుగువాళ్ళు కావడం మరో విశేషం. కామన్వెల్త్‌లో తొలిసారిగా నిర్వహించిన మహిళల క్రికెట్‌లో భారత్ రజతపతకం సాధించిది. ఆస్ట్రేలియాతో జరిగిన ఫైనల్స్‌లో భారత్ జట్టు పోటాపోటీగా ఆడి కేవలం 9 పరుగుల తేడాతో ఓడిపోయింది. హాకీలో కూడా ఆస్ట్రేలియా చేతిలో ఓటమిపాలై ద్వితీయ స్థానానికి దిగిపోయింది. గెలుపు ఓటము లన్నవి క్రీడల్లో సర్వసాధారణం. ఓడినవారు రేపటి గెలుపుకు సన్నద్ధం కావడమే తరువాయి. ఏదేమైనా భారత్ క్రీడాకారు లందరూ ఈ క్రీడల్లో దేశం గర్వించేవిధంగా ఆడి, పతకాలు సాధించడం ఎంతైనా అభినందనీయం. ఇక్కడ ముఖ్యమైన మరో విషయం ఏమిటంటే, మన భారత్‌లో క్రీడాకారులకు తొలినుంచి ఆశించినస్థాయిలో ప్రోత్సాహం లేకపోవడం. చిన్నతనం నుంచి శిక్షణ ఇస్తే మెరికల్లాంటి క్రీడాకారులెందరో తయారవుతారు. ఆటలంటే ఇష్టపడేవారిని ఇంటా బయటా ఎవరూ పెద్దగా ప్రోత్సాహం ఇవ్వకపోతుండడంతో అనేకమంది బాలలు ప్లేగ్రౌండ్‌లో ప్రేక్షకులుగానే ఉంటున్నారు తప్ప క్రీడాకారులు కాలేకపోతున్నారు. ప్రభుత్వాలు కూడా క్రీడాకారు లకు సదుపాయాలను, శిక్షణావసతులను ఇంకా బాగా మెరుగుపరచాలి. క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించాలి. మట్టిలో మాణిక్యాలుంటాయి. వెలికితీస్తే తప్ప వాటి విలువ తెలియదు. క్రీడాసంఘాలు బోలెడున్నాయి. అవి రాజకీయాలు మానుకుని నైపుణ్యంతో రాణించే క్రీడాకారులను గుర్తించి, వారికి అవసరమైన చేయూతనందించి ప్రోత్సహిస్తే.. పతకాలు అవే పరుగెత్తుకుంటూ వస్తాయి.

# పొగతోట కాదు 'పగతోట'..!



"వైద్యో నారాయణ హరిః" అన్నారు... మన పెద్దలు. అంటే డాక్టర్ భగవంతుడితో సమానం అని అర్థం. దైవం మనిషికి ప్రాణం పోసి దేహం రూపంలో సృష్టిస్తాడు. ఆ దేహం పార్థివదేహంగా మారే వరకూ వచ్చే సకల రోగాలనూ తన వైద్యంతో నయం చేస్తారు కాబట్టి వైద్యులు దేవుళ్లయ్యారు. కుల, మత, లింగ బేధం లేకుండా మనిషి శరీరంలోని ప్రతీ భాగాన్ని క్షుణ్ణంగా చూసి, పరీక్షించి రోగ నిర్ధారణ చేసి చికిత్స చేస్తారు కాబట్టే వాళ్ళు కనిపించే బ్రహ్మ, అల్లా , క్రీస్తులుగా పిలువబడుతున్నారు, కొలవబడుతున్నారు. అలాంటి వైద్యులెందరికో నెలవైన ప్రాంతం నెల్లూరు పొగతోట. ఈ ప్రాంతం మొత్తం డాక్టర్లతో నిండిపోయి ఉంటుంది. సర్వరోగ పరిష్కార ప్రదేశంగా పొగతోట ప్రసిద్ధి. ఇక్కడ డాక్టర్లతోపాటు స్కానింగ్ సెంటర్లు, లాబొరేటరీలు, మందుల షాపులు, సర్జికల్ దుకాణాలు... ఇలా వైద్య ఆరోగ్యానికి సంబంధించి అవసరమైన అన్ని విభాగాలు అందుబాటులో ఉంటాయి.

అయితే, ఇక్కడ ప్రజలకు అవసరమైన ఆరోగ్య సేవలు ఏ స్థాయిలో ఉన్నాయో దోపిడీ కూడా అదే స్థాయిలో జరుగుతోంది. శారీరక రుగ్మతతో తమ వద్దకు వచ్చే రోగులను జలగల్లా పట్టి పీడిస్తున్నారు ఇక్కడి డాక్టర్లు. చిన్న వ్యాధితో తమ వద్దకు వచ్చే రోగికి ఆ జబ్బుని భూతద్దంలో చూపించి భయపెడుతున్నారు. స్కానింగులు,

## సమస్యల తో 'రణం'

టెస్టులు, ఎక్సరేలు అంటూ వేలకు వేలు ఖర్చుపెట్టిస్తున్నారు. తమకు రోగి చెల్లించే ఫీజులతోపాటు, స్కానింగ్ సెంటర్లు, లాబొరేటరీలు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తి పడుతున్నారు. మొత్తం పొగతోటలోని 90శాతం మంది డాక్టర్ల వైఖరి ఇంతే. కేవలం పొగతోటలోనే కాకుండా నగరంలో ఇతర ప్రాంతాలలో క్లినిక్‌లు నిర్వహించే వైద్యులది కూడా ఇదే తీరు. కొంతమంది తమ ఆసుపత్రులలోనే అన్ని సదుపాయాలు ఏర్పరచుకుని టెస్టులు, స్కానింగులు, ఎక్స్‌రేల వంటివి కూడా వాళ్ళే లాగించేస్తున్నారు. ఇక సొంతంగా నడిపే మందులషాపుల సంగతైతే అసలు చెప్పనక్కర్లేదు. మెడికల్ కంపెనీల ప్రతినిధులు ఉచితంగా ఇచ్చే శాంపిల్స్ కూడా దుకాణంలో పెట్టి అమ్మేస్తున్నారు. పొగతోటలో వసతులు కూడా అధ్వాన్నంగా ఉంటాయి. ఒక్క ఆసుపత్రికి కూడా పార్కింగ్ ఉండదు. తమ ఆసుపత్రుల ప్రాంగణంలోనే ఇళ్లను కూడా కట్టుకుని కేవలం వాళ్ళ కార్లు మాత్రం పెట్టుకోవడానికి పార్కింగ్ ఏర్పరచుకుని ఉంటారు. తమకి వేలకు వేలు చెల్లించే పేషెంట్ల వసతుల గురించి మాత్రం పట్టించుకోరు. క్లినిక్‌లలో కనీస వసతులు ఉండవు. డాక్టర్ల అపాయింట్‌మెంటు కోసం ఎదురుచూసే వారికి టాయిలెట్ల వసతి కూడా కరువే. అన్ని వసతులూ ఉన్న కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా సొమ్ములు మాత్రం గుంజుతున్నారు. అందుకే కాబోలు పొగతోటకు వచ్చే రోగులు ఇది పొగతోట కాదు 'పగతోట' అని వాపోతున్నారు.

- సంచారి

## విలక్షణ నేత...
# మన వెంకయ్య

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

నా చిన్నతనం నుండీ వెంకయ్యను చూస్తున్నాను, క్రమశిక్షణ, కార్యదక్షత కలిగిన విలక్షణ నేత వెంకయ్య. వి.ఆర్.కళాశాలలో నాకు జూనియర్. విద్యార్థి దశలో కూడా ఎక్కడా రాజీపడేవాడు కాదు. తాను అనుకున్నది సాధించడం కోసం ఎంతటి వారినైనా ఎదిరించేవాడు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం పోరాడడానికి వెనుకాడేవాడు కాదు. తన వాక్చతురతతో అసంబ్లీ టైగర్ అనిపించుకున్నాడు. యువప్రాయంలోనే అనారోగ్యం పాలై మృత్యువును జయించాడు. పలుమార్లు హెలికాప్టర్ ప్రమాదాల నుండి తప్పించుకున్నాడు. అదృష్టాన్ని తన వెంటే పెట్టుకుని తిరిగేవాడు. అపార ప్రజాభిమానం కలిగిన జననేత కాలేకపోయినా, తన పేరు ప్రపంచమంతా తెలిసేలా జాతీయస్థాయి నాయకుడిగా ఎదిగాడు. తాను ఏ స్థాయిలో ఉన్నా నెల్లూరు శివాజీ(సీమా) సెంటర్ గణేష్ ఉత్సవాలను తప్పని సరిగా తానే ప్రారంభించేవాడు. సభలో ఏదైనా విషయం గురించి చర్చించాలనుకున్నా లేదా ప్రశ్నించాలనుకున్నా ముందుగా ఆ విషయానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని అవపోసన పట్టి, అవగాహన చేసుకుని మాట్లాడేవాడు. ఆయనలో ఉన్న అనేక విలక్షణమైన లక్షణాలు వెంకయ్యనాయుడి ఎదుగుదలకు ఉపకరించాయి. ఇన్నేళ్ళ తరువాత ఆయన ప్రజా జీవనం నుండి విరామం తీసుకుంటున్నాడంటే కొంచెం మనసుకి బాధ కలిగింది. మనవాడు, మన నెల్లూరువాడు, మన తెలుగువాడు అంచెలంచెలుగా ఎదిగి ఉపరాష్ట్రపతి స్థానానికి చేరుకున్నాడంటే మనకందరికీ గర్వకారణమే కదా మరి...!

డాక్టర్ భాస్కర్‌రెడ్డి - ఇండియానాపోలిస్, యు.ఎస్.ఏ.

## నెల్లూరు పెద్దాసుపత్రిలో సూపర్ స్పెషలిష్టు లేడు,
# అవసరమైన పరీక్షా యంత్రాలూ లేవు!

ఎంతో ప్రతిష్టాత్మకమైన వైద్యాలయం నెల్లూరుజిల్లా ప్రధాన ఆసుపత్రి(పెద్దాసుపత్రి). ఇప్పుడు ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా కూడా ఉంది. ఎంతో మంది పేద మధ్య తరగతి ప్రజలకు ఈ ఆసుపత్రి ఆధారం. అసలే కరోనా తరువాత ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లు తమను అడిగే నాథుడెవడన్నట్లు విపరీతంగా ధరలు పెంచి ప్రజలను నిలువు దోపిడి చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్య, వైద్యంకు ప్రాధాన్యత ఇస్తామని అంటున్నా క్రింది స్థాయిలో ఆచరణలో అది జరగడంలేదు. ఇంత పెద్ద ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఒక్క సూపర్ స్పెషలిష్టు లేకపోవడం అన్యాయం. సూపర్ స్పెషలిస్టులకు కొరత లేదు, కానీ వాళ్ళు సూపర్ స్పెషాలిటీ చేశాక సొంత దుకాణం వైపే మొగ్గు చూపుతారు. అయితే మన ప్రక్కనున్న కేరళలో దీనికి ఒక తాత్కాలిక పరిష్కారం చూపారు. ప్రతి సూపర్ స్పెషాలిటీ డాక్టరు వారానికి ఒకరోజు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయాలని నిబంధన విధించారు. వైద్య విద్య అభ్యసించే వారిపైన ప్రభుత్వం కూడా కొంత ధనం ఖర్చు పెడుతుంది. అందుకు బదులుగా వారానికి ఒకరోజు తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులను చూడాలి. మన ప్రభుత్వం అనుకుంటే కేరళ ప్రభుత్వం తరహాలో ఇదే రకమైన నియమం ఇక్కడా తెస్తే పేదలకు మంచి వైద్యం అందించినట్లవుతుంది. అంతే కాకుండా పెద్దాసుపత్రిలో పూర్తిస్థాయిలో అవసరమైన పరీక్షా యంత్రాలు కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.

జీవీ నాగరాజరావు - అడ్వకేటు, హైకోర్టు.


# బహిరంగ కామక్రీడ వ్యక్తిగతమా...?

హిందూపూర్ పార్లమెంటు సభ్యుడు గోరంట్ల మాధవ్ అంగ ప్రదర్శన వ్యవహారంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ, ఆ పార్టీ సలహాదారులు, నేతలు వ్యవహరిస్తున్న తీరు అసహ్యం కలిగిస్తోంది. సిగ్గు, మానం, మర్యాద లేకుండా అతి జుగుప్సాకరంగా ప్రవర్తించిన మాధవ్‌ని తక్షణమే పార్టీ నుండి సస్పెండ్ చేయకుండా ఫోరెన్సిక్ రిపోర్ట్, మార్ఫింగ్, బొంగు, బోషాణం అంటూ కాలయాపన చేయడం నేటి రాజకీయ పరిస్థితులకు అద్దం పడుతుంది. మాధవ్ అంగ ప్రదర్శన, సెల్‌ఫోన్ ద్వారా ఆయన నెరిపిన కామక్రీడ తదితర అంశాలు ఆయన వ్యక్తిగతం అని పార్టీ సలహాదారులు మాట్లాడడం వారి పరిపక్వతను తెలియజేస్తుంది. గతంలో ఒక భాజపా మంత్రి కర్ణాటక అసెంబ్లీలో కూర్చుని సెల్‌ఫోన్‌లో బూతు వీడియోలు చూసినందుకే పెను దుమారం చెలరేగి ఆ మంత్రిపదవి ఊడే పరిస్థితులకు దారితీసింది. అలాంటిది, సాక్షాత్తు ఒక పార్లమెంటు సభ్యుడే సిగ్గు లేకుండా తన అంగప్రదర్శన చేస్తూ తానే వీడియో తీసుకుని సామాజిక మాధ్యమాలకెక్కితే, వ్యక్తిగతం, మార్ఫింగ్, ఫోరెన్సిక్ అని సొల్లు చెప్తున్న పార్టీ, ఆ పార్టీ నేతలూ మహిళల మనోభావాలను ఏ విధంగా గౌరవించగలరో, వారి మాన ప్రాణాలను ఎలా కాపాడగలమని హామీ ఇవ్వగలరో వారికే తెలియాలి..!

పుట్టా హరిత - గూడూరు.

# 'తంగిరాల మహాభారతం'

## 16వ భాగం




కణ్వ మహాముని ఎంతసేపటికీ రాకపోయే టప్పటికీ, దుష్యంతుడు ఇక ఉండలేక గాంధర్వ వివాహం చేసుకుందామని అడుగుతాడు. శకుంతల ఒప్పుకుంటుంది కానీ, తమకు పుట్టబోయే కుమారుడికి రాజ్యాభిషేకం చెయ్యాలని కోరుతుంది. అలాగే అని మాట ఇచ్చి ఆమెను గాంధర్వ వివాహం చేసుకుంటాడు. కొంత సమయం ఇద్దరు సుఖాలనుభవిస్తారు. అప్పుడు దుష్యంతుడు మళ్ళీ తొందరలో పరివారాన్ని పంపించి శకుంతలని హస్తినాపురం తీసుకువెళతానని ధైర్యం చెప్పి వెళ్లిపోతాడు.

కణ్వ మహాముని ఆశ్రమానికి వచ్చినప్పుడు శకుంతల సిగ్గుపడి ఆయనకు కనపడదు. కణ్వ మహాముని దివ్యదృష్టి ద్వారా తెలుసుకుని, శకుంతలని పిలిచి, ఆమె చేసిన దాంట్లో ఏమి అధర్మం లేదని ఆశీర్వదించి, నీకు పుట్టబోయే పిల్లాడు ఈ భూమండలానికి సార్వభౌముడవుతాడని దీవిస్తాడు.

కొన్నాళ్ళకి శకుంతల గర్భవతై ఒక పిల్లాణ్ణి కంటుంది. ఆ పిల్లవాడు చిన్నప్పుడే క్రూర జంతువులతో ఆడుకుంటూ ఆశ్రమంలో చెట్టుకి కట్టేస్తాడు. అందువల్ల ఆ బాలునికి సర్వ దమనుడు అనే పేరువస్తుంది. ఆయనకు యుక్తవయస్సు రాగానే, కణ్వముని ఇక శకుంతలని అత్తారింటికి వెళ్ళమని ఆదేశిస్తాడు. శకుంతల కుమారుని తీసుకుని దుష్యంతుని దగ్గరకు వెళుతుంది. దుష్యంతుడు ఆమెను గుర్తుపట్టడు. శకుంతల అన్నీ గుర్తుచేసినా తనకేమి తెలియదని, ఇక్కడ నుంచి వెళ్లిపొమ్మని దురుసుగా మాట్లాడుతాడు. శకుంతల ఎంత ప్రాధేయపడినా ఈసడించి పడేస్తాడు. చివరికి శకుంతల వెళ్లిపోవటానికి సిద్ధపడితే.. ఆకాశవాణి ప్రత్యక్షమై శకుంతల చెప్పింది యదార్థమని ఆ పిల్లవాడు దుష్యంతుని కుమారుడే అని, ఆయన ఇక నుంచి భరతుడి పేరుతో ప్రసిద్ధిచెందుతాడని చెపుతుంది. దుష్యంతుడు, తనకు ముందే తెలుసనీ, కానీ కుమారుని మీద అపవాదు రాకుండా చెయ్యటానికి అలా మాట్లాడానని చెప్పి శకుంతలని, భరతుణ్ణి అంగీకరించి, భరతుడికి పట్టాభిషేకం చేసి, శకుంతలతో అడవులకి వెళ్లి తపస్సు చేసుకుంటాడు.

**భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.**

**పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**

# గంగపట్నంలో భారీ ర్యాలీ

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈనెల 10న ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 100 అడుగుల త్రివర్ణ పతాకంతో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వైకాపా కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, పాఠశాల హెడ్‌మాస్టర్ చలపతి, వ్యాయామ ఉపాధ్యాయుడు ముజీర్, విద్యాకమిటీ ఛైర్మెన్ మహేష్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మహీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# మద్యంతోనే సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడా మద్యం లభించకుండా పటిష్టమైన చర్యలు తీసుకుని మద్యాన్ని కట్టడి చేశారు. అంతేకాదు ఒకడుగు ముందుకేసి ఆంధ్రా కంటే తక్కువ రేట్లకు మద్యం అమ్మే రాష్ట్రాలనుండి మన రాష్ట్రానికి మద్యం రాకుండా కూడా సరిహద్దులో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. తమకు దొరికిన అధికారాన్ని అవకాశంగా మార్చుకుని సరిహద్దులో చివరికి మహిళల హ్యాండ్ బ్యాగ్‌లను కూడా తనిఖీ చేస్తూ ఖాకీలు తమ ప్రతాపం చూపించే స్థాయిలో ఆ నిఘా అమలవుతోంది.

2019లో అధికారంలోకి రాకముందు ప్రజా సంకల్పయాత్రలో తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలలో 90 శాతం తమ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్లలో నెరవేర్చామని వైసీపీ నేతలు తరచూ చెప్తూనే ఉన్నారు. చెప్పిన వాటితో పాటు చెప్పనవి కూడా చాలానే చేశామన్నది వారి వాదన. అయితే పాదయాత్రలో చెప్పిన వాటిలో 90శాతం మాత్రమే నెరవేర్చామని మాత్రం ఒప్పుకుంటున్నారు. ఆ పదిశాతంలో సంపూర్ణ మద్యపాన నిషేధం ఉందన్నది మేధావుల అభిప్రాయం. అది అసాధ్యమన్నది కూడా వారి వాదన. రాష్ట్రం అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, శాశ్వత ఉపాధి, దీర్ఘకాలిక ప్రయోజనాలు పక్కనపెడితే, ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే నిధులు కావాలి. నిత్యం బటన్ నొక్కాలంటే ఆషామాషీ కాదు. కాదు.. కూడదు అని చెప్పిన మాటకి కట్టుబడి సంపూర్ణ మద్యపాన నిషేధం విధిస్తే, నోట్ల కట్టలు ముద్రించే మిషన్ బటన్ కూడా నొక్కితే తప్ప, ఆ బటన్లు చివరిదాకా నొక్కడం సాధ్యం కాదన్నది విశ్లేషకుల అభిప్రాయం. చెత్త పన్ను, వాహన పన్ను, రోడ్డు పక్కన ఉన్న స్థలాలపై పన్ను, ఇలా ఎన్నిరకాల పన్నులు విధించినా మద్యంలో వచ్చే ఆదాయంతో అవేవి సరితూగలేవంటున్నారు ఆర్థిక మేధావులు.

నవరాత్నాలలో భాగంగా బటన్‌లు నొక్కాలి, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలివ్వాలి, రిటైర్డ్ ఉద్యోగుల అకౌంట్లలో పెన్షన్లు జమ చేయాలి, వీటితో పాటు ముఖ్యమంత్రి, మంత్రులు, సలహాదారులు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు, వారి కార్యాలయాలు, కార్లు, ప్రయాణాలు, పర్యటనలు, వారి వసతి ఏర్పాట్లు ఇలా వేల కోట్లలో ఆదాయం కావాలి, ఆ ఆదాయం ఒక్క మద్యంతోనే సాధ్యం. ఏ విధంగా చూసినా సంపూర్ణ మద్యపాన నిషేధం అసాధ్యం కాబట్టి, రాష్ట్రంలో మద్యం కొనసాగించడం తథ్యం అంటున్నారు విశ్లేషకులు.



నెల్లూరు కబుర్లు




# ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి

**- జేసీ కూర్మనాథ్**

అజాదీ కా అమృత్ మహోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 13 నుంచి 15వ తేది దాకా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై దేశభక్తితో మువ్వన్నెల జెండాలను ఎగురవేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పిలుపునిచ్చారు. ఈనెల 7న నెల్లూరులో భారీగా నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో రానున్న ఆగస్టు 15 స్వాతంత్ర్యదినోత్సవం అమృతదినోత్సవమని అన్నారు. విద్యార్థులు, యువత పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. నగర మేయర్ పొట్లూరి స్రవంతి, నగర కార్పొరేషన్ కమిషనర్ హరిత పాల్గొని మాట్లాడారు. తొలుత స్థానిక సర్వోదయ కళాశాల వద్ద నుంచి గాంధీ బొమ్మ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. జడ్పీ సిఇఓ వాణి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కనకదుర్గాభవాని, సెట్నెల్ సిఇఓ పుల్లయ్య, కార్పొరేటర్లు వాసంతి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### జయభారత్ ఆసుపత్రివారి సౌజన్యంతో..

# ఉచిత వైద్యశిబిరం

నెల్లూరులోని కిసాన్‌నగర్ మునిసిపల్ పాఠశాలలో ఈనెల 7న స్థానిక జయభారత్ ఆసుపత్రి వారి సౌజన్యంతో, సింహపురి వైద్యసేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సాధారణ వైద్యపరీక్షలతో పాటు నేత్ర పరీక్షలు కూడా చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్యులు విజయ వాణి, దేదీప్యరాయల్, గ్లోరీతో పాటు జయభారత్ ఆసుపత్రి మేనేజర్ గురుప్రసాద్, సింహపురి వైద్యసేవా సమితి సభ్యుడు రూపేంద్ర తదితరులు పాల్గొన్నారు.






# నెల్లూరులో చేనేత వస్త్రాల ప్రదర్శన

చేనేతవస్త్రాలను విరివిగా కొనుగోలు చేసి చేనేతకారులను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు పిలుపునిచ్చారు. ఈనెల 7న నెల్లూరు కస్తూర్బా బాలికల విద్యాలయం ప్రాంగణంలోని రవీంద్రనాథ్ ఠాగూర్ భవన్‌లో ఏర్పాటుచేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈనెల 7 నుంచి 13వ తేది వరకు చేనేత వస్త్ర ప్రదర్శన జరుగుతుందని, 30 చేనేత వస్త్ర విక్రయస్టాళ్ళతో ఉన్న ఈ ప్రదర్శనలో కళాత్మకమైన చేనేత వస్త్రాలెన్నో ఉన్నాయని తెలిపారు. చేనేతను అందరూ ప్రోత్సహించాలని కోరారు. తద్వారా చేనేతకారులను ఆదుకున్నట్లవుతుందన్నారు. చేనేతను ప్రోత్సహిద్దాం.. నేతన్నలను ఆదుకుందామంటూ తొలుత కలెక్టర్ చేనేత ప్రాధాన్యత అందరికీ తెలిసేలా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. నగర మేయర్ స్రవంతి, జేసీ కూర్మనాథ్, కార్పొరేషన్ కమిషనర్ హరిత, లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, చేనేత జౌళిశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆనంద్‌కుమార్, చేనేత కార్పొరేషన్ డైరెక్టర్ ఆదిలక్ష్మి, నాబార్డ్ డిజిఎం కెవిఎస్ ప్రసాద్, జడ్పీ సిఇఓ వాణి, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు గుత్తికొండ శ్రీనివాసులు, జాతీయ చేనేత ఐక్యవేదిక నాయకుడు దోనేపూడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరుకు కొత్త ఆర్డీఓ



నెల్లూరు ఆర్డీఓగా మలోల ఈనెల 8న బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ జిల్లాలో డిఆర్ఓగా పనిచేస్తున్న ఆయన బదిలీపై నెల్లూరుకు వచ్చారు. ఈ స్థానంలో ఇప్పటిదాకా పనిచేస్తున్న ఆర్డీఓ కొండయ్య సత్యసాయి జిల్లాకు డిఆర్ఓగా బదిలీ అయ్యారు.



### జెఇఇ మెయిన్ ఫలితాల్లో

# 'విశ్వసాయి' ప్రభంజనం

ఇటీవల ప్రకటించిన జెఇఇ మెయిన్ ఫలితాల్లో నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను నిరూపించుకున్నారు. 102 మందికి పైగా విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమంగా రాణించి, జెఇఇ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. ప్రత్యేకించి సిహెచ్ భరద్వాజ్ జాతీయస్థాయిలో 608వ ర్యాంకు, పి. హేమంత్‌కుమార్‌రెడ్డి 1564వ ర్యాంకు సాధించారని కళాశాల ఛైర్మెన్ డా.ఎన్.సత్యనారాయణ తెలిపారు. ఉత్తమస్థానాలు సాధించిన విద్యార్థులను స్థానిక బివినగర్‌లోని విశ్వసాయి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈ విజయాలకు కారణమైన అధ్యాపకులను, తల్లితండ్రులను కళాశాల వైస్‌ఛైర్మెన్ కృష్ణమోహన్ ప్రశంసించారు.

# ఉన్న పింఛన్లు.. తీసేయడం దారుణం



రాష్ట్రవ్యాప్తంగా అనేకమందికి ఎన్నోఏళ్ళుగా ఇస్తున్న పింఛన్లను జగన్ ప్రభుత్వం తీసేస్తుండడం దారుణమని, రాష్ట్రంలో ఏ నేతైనా ఇప్పటిదాకా పింఛన్లు ఇవ్వడమే కానీ తొలగించడం చేయలేదని, ఆ ఘనత సిఎం జగన్‌కే దక్కిందని టిడిపి నాయకురాలు తాళ్లపాక అనూరాధ ధ్వజమెత్తారు. కొత్త నిబంధనల పేరుతో పింఛన్లు తొలగించడం అన్యాయమంటూ ఆమె ఈనెల 8న టిడిపి నాయకులు, కార్యకర్తలతో భారీగా తరలివచ్చి నెల్లూరులోని కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. జగన్ అధికారంలోకి వచ్చి మూడేళ్ళు గడుస్తున్నా పింఛనుదారులకు 3వేలు ఇస్తామన్న మాట నిలబెట్టుకోలేకపోతున్నారని ఆమె విమర్శించారు. టిడిపి నాయకులు రవికుమార్‌చౌదరి, బాలకృష్ణచౌదరి, ప్రసాద్, రాజా, నారాయణ, కల్యాణ్, ప్రభాకర్, వనజ, భూలక్ష్మి, హజరత్ తదితరులు పాల్గొన్నారు.



### అమృతోత్సవాల వేళ.. అన్ని పార్టీల నేతలూ..

# బెజవాడ గోపాలరెడ్డిని మరచిపోయారు

## జయంతి రోజున ఆయన ఆత్మను క్షోభ పెట్టిన పార్టీలు, ప్రభుత్వం!


గోపాలరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న విగ్రహ సమీపంలోని ఓ వస్త్ర దుకాణ ఉద్యోగి.

***నెల్లూరుజిల్లా గర్వించదగిన పాత తరం నేత డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి. ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు. విలువలున్న రాజకీయ నేత. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా సేవలందించారు. కేంద్ర సమాచార, ప్రచారశాఖ మంత్రిగా మంచిపేరు గడించారు. ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా సైతం పనిచేశారు. ఆయన కేవలం స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ దురందురులూ మాత్రమే కాదు, సాహిత్యాభిలాషి, అంతకు మించి అపార జ్ఞాన సంపద కలిగిన సాహితీ వేత్త కూడా. అలాంటి మహనీయుడిని విస్మరించారు మనవాళ్ళు. ఆయన ఆత్మను క్షోభపెట్టారు నెల్లూరు జిల్లా రాజకీయ నాయకులూ, అధికారులు. 'ఆజాదికా అమృత్ మహోత్సవ్' పేరుతో భారతదేశమంతా 75వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాన్ని జరుపుకోవడానికి ఉత్సాహంతో ఉరకలేస్తున్న తరుణంలో గోపాలరెడ్డి జయంతి రోజున ఆయనకు ఘోర అవమానం చేశారీ ఘనులు.***


ఆగస్టు 5వ తేదీ గోపాలరెడ్డి 115వ జయంతి. నెల్లూరు మినీ బైపాస్‌లో ఉన్న గోపాలరెడ్డి విగ్రహానికి ఒక్కరైనా కనీసం పూలమాల కూడా వేయలేదు. నగరంలో ఉన్న అనేకమంది ప్రముఖుల విగ్రహాల వద్ద వారి జయంతి, వర్ధంతులను జరుపుకోవడం ఆనవాయితీ. ఇది నగర కార్పొరేషన్ బాధ్యత కూడా. కానీ గోపాలరెడ్డిని సొంత జిల్లా నెల్లూరులో స్మరించుకునే నాథుడే కరువయ్యాడు.

'అజాదీ కా అమృత్ మహోత్సవ్' పేరుతో స్వాతంత్ర్య వజ్రోత్సవ సంబరాలు జరుపుంటున్న తరుణంలో ఈ ఉత్సవాలకు ప్రేరణ కల్పిస్తున్న భారతీయ జనతా పార్టీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న వై.ఎస్.ఆర్. కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం చివరికి గోపాలరెడ్డి తుదిశ్వాసవరకూ కొనసాగిన కాంగ్రెస్‌పార్టీ కూడా ఆయనను విస్మరించడం దారుణం. జిల్లా కలెక్టర్ సూచన మేరకు జిల్లాపరిషత్ కార్యాలయంలో నామమాత్రపు నివాళి అర్పించారు. అయితే అక్కడా అధికారులు బెజవాడ గోపాలరెడ్డి చిత్రపటానికి బదులుగా బెజవాడ రామచంద్రారెడ్డి ఫోటో పెట్టి తమ ప్రతిభ ప్రదర్శించారు. కస్తూరిబా కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో గోపాలరెడ్డి ఛాయాచిత్రాన్ని పెట్టి పూలమాల వేసి నివాళులర్పించారు. గోపాలరెడ్డి జీవిత విశేషాలను చదివి వినిపించారు. అయితే జిల్లా కలెక్టర్‌తో సహా సభలో పాల్గొన్న వారెవరూ గోపాలరెడ్డి ప్రస్తావనే తేకపోవడం గమనార్హం. మంత్రులు, మాజీ మంత్రులతో సహా అధికార, అనధికార పార్టీ నాయకులందరూ నిత్యం గోపాలరెడ్డి విగ్రహం కూడలి మీదుగానే ప్రయాణిస్తుంటారు. జిల్లా గర్వించదగిన అలాంటి నాయకుడికి నివాళిగా కనీసం ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలు కూడా నిర్వహించలేకపోవడం గతించిన నాయకుల పట్ల వారికున్న గౌరవాన్ని ప్రస్ఫుటం చేస్తుంది. ఇప్పుడుండే సీజనల్ రాజకీయ నాయకులకు ఎలాగూ అంతటి ఖ్యాతి రాదు. వారు బ్రతికి ఉండగానే ప్రజలు వారిని మర్చిపోయే పరిస్థితి రావొచ్చు. పాత తరం రాజకీయాలలో స్ఫూర్తిప్రదాతలుగా నిలచిన గోపాలరెడ్డి లాంటి మహానుభావులనన్నా స్మరించుకుని, ఈ తరం నేతలు స్ఫూర్తి పొందితే బాగుంటుందని గోపాలరెడ్డి అభిమానులు కోరుతున్నారు. కనీసం ఆయన పుట్టిన రోజైన ఆగస్టు 5న, ఆయన దివంగతులైన మార్చి 9న ఆయనను స్మరించుకుని తమ నైతిక బాధ్యతను నెరవేర్చు కోమని కోరుతున్నారు.

ఈ రెండు తేదీలను కార్పొరేషన్ కౌన్సిల్‌లో పెట్టి ఆమోదింపచేస్తే, భవిష్యత్తులో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రతి ఏటా గోపాలరెడ్డి విగ్రహం వద్ద అధికారిక నివాళి జరిగిపోతుంది. ఇకనైనా నెల్లూరు నేతలు ఆ పని చేస్తారో లేదో చూద్దాం..!














# నిఖిత - సందేశ్

అలయన్స్ నిర్మాణ సంస్థల భాగస్వాములైన బొమ్మిరెడ్డి సోదరులలో రెండవ వారు, రోటరీ సంస్థ ద్వారా సామాజిక సేవా రంగంలో రాణిస్తున్న సేవాభిలాషి బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి - మైథిలిల ఏకైక కుమార్తె **నిఖిత - సందేశ్** (హైదరాబాదు వాస్తవ్యులు గజ్జల విద్యావతి - మధుసూదన్‌రెడ్డిల కుమారుడు)ల పెళ్లి ఆగస్టు 4వ తేదీ హైదరాబాదులో వైభవంగా జరిగింది. పెళ్లి కుమార్తె నిఖిత పెదనాన్న సురేష్, చిన్నాన్న సునీల్ కుటుంబసభ్యులతో పాటు బొమ్మిరెడ్డి కుటుంబ ఆప్తులు, ఆత్మీయులు ఈ పెళ్లి సందడిలో పాల్గొని నిఖిత - సందేశ్‌లను ఆశీర్వదించారు. నవ వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.











### భరతమాత విముక్తి కోసం.. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం..

# సమరశంఖం పూరించి.. కదంతొక్కిన సింహపురి సీమ

- 'వందేమాతరం' నినాదాలతో మార్మోగిన నెల్లూరు
- కొదమసింహాలుగా మారిన స్వాతంత్ర్యయోధులు

**'వందేమాతరం'..అంటేనే జైళ్ళకు పట్టుకుపోయే రోజులవి. బ్రిటిష్ పాలకుల దౌష్ట్యాలతో జిల్లా ప్రజానీకం అట్టుడికిపోతున్న రోజుల్లో తెల్లదొరల అత్యంత క్రూరమైన దాష్టీకాలకు, భయంకర నియంతృత్వానికి వ్యతిరేకంగా సింహపురి సీమ ఉద్యమాల పురిటిగడ్డగా మారింది. భరతమాత దాస్యశృంఖలాలను తెగదెంచాలని, ప్రజలకు స్వాతంత్ర్యం తెచ్చిపెట్టాలని కంకణం కట్టుకుని ఎందరో స్వేచ్ఛాపిపాసులు స్వాతంత్ర్యయోధులై ఉద్యమాల బరిలోకి దిగారు. లాఠీలతో వళ్ళంతా విరగకొడుతున్నా సరే..లెక్కచేయకుండా 'స్వాతంత్ర్యం మా జన్మహక్కంటూ'..'వందే మాతరం' అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదించారు. బ్రిటిష్ పోలీసుల చేతిలో చావుదెబ్బలు తిన్నారు. తీవ్రంగా గాయపడ్డారు. జైళ్ళకెళ్లారు. కఠినశిక్షలను అనుభవించారు. చిత్రహింసలను ఓర్చుకున్నారు. మూకుడన్నం తిన్నారు. ముంతనీళ్ళు తాగుతూ ప్రాణాలను ఉగ్గబట్టుకున్నారు. బయటికొచ్చాక మళ్లీ ఉద్యమగీతం అందుకున్నారు. ప్రజలను చైతన్యవంతం చేసి ఉద్యమాల బాట పట్టించారు.**

భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో నెల్లూరుసీమ పాత్ర తక్కువైనదేమీ కాదు. జిల్లాలో ఒకవైపు స్వాతంత్ర్యోద్యమం, జమీన్‌దారీ రైతు ఉద్యమం మరోవైపు. రెండింటి లోనూ పాల్గొని నెల్లూరీయులు తమ పోరాట సత్తా చాటుకున్నారు. మొదట్లో కొద్దిమందితోనే ప్రారంభమైన స్వాతంత్ర్యోద్యమం క్రమేణా వేలాదిమంది ప్రజలతో హోరెత్తింది. నెల్లూరు ప్రజల దేశభక్తిని మహాత్మాగాంధీజీ ప్రత్యేకంగా ప్రశంసించారంటే నాటి స్వాతంత్ర్యయోధుల పోరాటం, దేశ సేవలు ఎంత ఘనమైనవో తెలుస్తుంది. నెల్లూరుజిల్లాలోని పల్లిపాడు అనే చిన్నపల్లెలో స్వయంగా గాంధీజీ చేతుల మీదుగానే ప్రారంభమైన సత్యాగ్రహాశ్రమం అందుకు ఒక నిదర్శనంగా నిలుస్తుంది.

1920లో నాగపూర్ కాంగ్రెస్ సమావేశంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా 'సహాయ నిరాకరణ' ఉద్యమానికి తీర్మానం జరిగింది. ఇది భారతదేశ స్వాతంత్ర్య చరిత్రలో ఒక అపూర్వమైన ఘట్టం. కానీ అప్పటికే దేశభక్తితో దేశమంతా ఉద్యమాలు ముమ్మరంగానే ఉన్నప్పటికీ, ఆనాటి నుంచి మరింతగా ఉధృతమయ్యాయి. భరతమాత దాస్యశృంఖలాలను ఛేదించి దేశానికి స్వాతంత్ర్యాన్ని సముపార్జించాలనే లక్ష్యంతో లక్షలాదిగా దేశభక్తులు ఉద్యమాలకు సిద్ధమవుతున్న కాలమది. ఈ నేపథ్యంలో నెల్లూరుజిల్లాలోనూ ఉద్యమాల నెగడు వెలిగించారు. అప్పటికే, అంటే 1904 నుంచే జాతీయభావాలతో విద్యాలయాలను నెలకొల్పడం, విదేశీవస్తు బహిష్కరణ, (మిగతా 10వ పేజీలో)





## ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు.. అందరికీ వందనాలు

*దేశాన్ని బ్రిటిష్‌పాలకుల నియంతృత్వపు కోరల నుంచి కాపాడాలని, మహాత్మాగాంధీజీ అడుగుజాడల్లో నడుస్తూ జిల్లాలోని వేలాదిమంది స్వాతంత్ర్యయోధులు, సమాజసేవకులు అమోఘమైన కృషిచేశారు. ఈ 75 ఏళ్ళ స్వాతంత్ర్యదినోత్సవ వేళ..ఆ త్యాగధనులకు శతకోటి వందనాలు. స్వాతంత్ర్యసమరంలో ఎగరేసిన జెండాలుగా రెపరెపలాడుతూ ఉద్యమంలో కదంతొక్కిన యోధులు. స్వాతంత్ర్య సమరశంఖారావాన్ని పూరిస్తూ జిల్లా స్వాతంత్ర్యోద్యమంలో ముందు వరుసలో నిల్చున్న వారెందరో ఉన్నారు. అలాంటి వారిలో ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధులు బెజవాడ గోపాలరెడ్డి, పొణకా కనకమ్మ, ఓరుగంటి వెంకటసుబ్బయ్య, వెన్నెలకంటి రాఘవయ్య,, పుచ్చలపల్లి సుందరయ్య, కవికోకిల దువ్వూరు రామిరెడ్డి, చతుర్వేదుల కృష్ణయ్య, దిగుమర్తి హనుమంతరావు, ఆనం చెంచుసుబ్బారెడ్డి(ఏసి సుబ్బారెడ్డి), బొమ్మా శేషురెడ్డి, దరిశి చెంచయ్య, జి.సి.కొండయ్య, నెల్లూరు వెంకట్రామానాయుడు, వేమూరు లక్ష్మయ్య, చుండూరు వెంకటకృష్ణయ్య, రాళ్ళపల్లి రామసుబ్బయ్య, కొమండూరు పార్థసారథి అయ్యంగార్, ఖాసా సుబ్బారావు, ఆమంచర్ల సుబ్బుకృష్ణారావు, ఇంద్రగంటి సుబ్రహ్మణ్యం, గాడేపల్లి పద్మనాభయ్య, చతుర్వేదుల రాఘవయ్య, బత్తెన రామకృష్ణారెడ్డి, తూములూరు అనంత పద్మనాభయ్య, గండవరపు హనుమారెడ్డి.. ఇలా చెప్పుకుంటూపోతే.. ఎందరో స్వాతంత్ర్యవీరులు వేలాదిగా ఉన్నారు. వారు చేసిన పోరాటాలు, త్యాగాలు ఎన్నని చెప్పగలం?..ఆ మహనీయులందరికీ..ఇప్పుడు జరుగుతున్న 'అజాదీ కా అమృత్ మహోత్సవాల' శుభతరుణంలో.. వందనాలు!..శిరసాభివందనాలు!..*



## మహనీయుడు.. మన బెజవాడ గోపాలరెడ్డి

నెల్లూరుజిల్లా స్వాతంత్ర్యోద్యమంలో అగ్రస్థానంలో నిలిచిన మహనీయుల్లో డా.బెజవాడ గోపాలరెడ్డి ప్రథములు. పుట్టుకతోనే ఆగర్భశ్రీమంత్రుడైనా చిన్నతనం నుంచి జాతీయ భావాలతో ఉంటూ ఉద్యమాల్లో పాల్గొని దేశమాత సేవలో పునీతమయ్యారు. బందరు జాతీయ కళాశాలలో కళాశాల చదువు చదువుకుని, ఆ తర్వాత కలకత్తాకు వెళ్ళి విశ్వభారతి విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసించారు. అక్కడికి ఒకటిన్నర మైలు దూరంలో ఉన్న శాంతినికేతన్‌లో చేరారు. గురుదేవుడైన రవీంద్ర కవీంద్రుని దర్శించుకుంటూ జీవితపాఠాలు నేర్చుకున్నారు. అక్కడే ఆయనకు జాతీయభావనలపై మరింత గురి కుదిరింది. మహాత్మాగాంధీ స్ఫూర్తితో గోపాలరెడ్డి జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. జిల్లా స్వాతంత్ర్య ఉద్యమాలకు నాయకత్వం వహించి పేరుగాంచారు. 13వ ఏటనే ఖద్దరు ఉద్యమంలో పాల్గొన్నారు. నిరుపమాన దేశభక్తికి, అచంచల ధైర్యానికి మారుపేరుగా ఉండే గోపాలరెడ్డిని బ్రిటిష్ పాలకులు పలుసార్లు జైళ్లలో నిర్బంధించారు. నిరుపేదలు గంజిలో వేసుకునే ఉప్పుమీద కూడా పన్ను విధించడం ఘోరమంటూ బ్రిటిష్ పాలకుల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా గాంధీజీ 1930 ఏప్రిల్ 6న గుజరాత్‌లోని 'దండి' సముద్రతీరంలో ఉప్పుసత్యాగ్రహం చేయబోతున్నారన్న సమాచారం దేశవ్యాప్తంగా ప్రజలను ఆకట్టుకుంది. గాంధీజీ స్ఫూర్తితో జిల్లాలోని మైపాడు సముద్రతీరంలో మొట్టమొదటి ఉప్పు సత్యాగ్రహ దళానికి నాయకత్వం వహించి సంచలన సృష్టించారు గోపాలరెడ్డి. దీంతో ఆయన్ను పోలీసులు అరెస్టు చేసి తమిళనాడులోని వెల్లూరు, కడలూరు జైళ్ళలో నిర్బంధించారు. 1930 ఆగస్టు 25న జైలు నుంచి విడుదల చేసిన గోపాలరెడ్డిని ఉద్యమాల్లో పాల్గొంటున్నారంటూ మళ్ళీ సెప్టెంబరు 1న అరెస్టు చేసి ఆరునెలలపాటు జైలు శిక్ష విధించారు. 1932లో అరెస్టుచేసి మరో 8నెలల పాటు జైలులో ఉంచారు. 1940లో వ్యష్టి సత్యాగ్రహంలోనూ పోలీసులు ఆయన్ను ఆరునెలల పాటు జైలులో నిర్బంధించారు. ఆ తర్వాత 1943 క్విట్ ఇండియా ఉద్యమంలోనూ అరెస్టు చేసి జైలులో పెట్టారు. అలా అనేక ఉద్యమాల్లో పలుసార్లు ఆయన్ను బ్రిటిష్‌వాళ్ళు జైళ్ళలో నిర్బంధించినా వెరవక జాతీయోద్యమంలో ఆయన తిరుగులేని పోరు సాగించారు. జైళ్ళలో ఎన్ని కష్టాలు పడ్డారో చెప్పలేం!..అయినా తొణికింది లేదు. ఒకసారి అలా జైలు నుంచి విడుదలై రైలు దిగి ఇంటికి వెళ్తూవుంటే, నెల్లూరులో విద్యార్థులు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రదర్శన నిర్వహించాలని తలపెట్టి, నాయకత్వం వహించేవారు లేక ఉద్యమం చేద్దామా వద్దా అని ఆలోచిస్తున్నారని తెలిసి, వెంటనే అక్కడికి వెళ్ళి 'నేనున్నా రండి' అంటూ వారందరితో కలసి ప్రదర్శన నిర్వహించి, పోలీసులు అరెస్టు చేయడంతో, అటునుంచి అటే మళ్ళీ జైలుకు వెళ్ళిన సాహసి బెజవాడ గోపాలరెడ్డి. ఆయన దేశసేవ గురించి ఎంత చెప్పినా తరగదు. ఆ తర్వాతకాలంలో ఆయనకెన్నో గొప్ప పదవులు వచ్చినా నీతి నిజాయితీలతో, మచ్చలేని మహోన్నత రాజకీయనేతగా అందరి మన్ననలు అందుకున్నారు. తాను భారతీయుడనని సగర్వంగా చెప్పే బెజవాడ గోపాలరెడ్డి సింహపురిసీమకే ఓ ఆణిముత్యం. అందరికీ ఆదర్శంగా నిలిచిన ఆ దేశభక్తునికి ఇవే అక్షరాభి వందనాలు!



## నెల్లూరును మెచ్చుకున్న గాంధీజీ

స్వాతంత్ర్యోద్యమంలో నెల్లూరు జిల్లాలో జరిగిన అనేక ఉద్యమాల్లో సింహపురి యోధులు, ప్రజల పాత్ర ఎంతో కీలకంగా ఉండడాన్ని మహాత్మాగాంధీ సైతం మెచ్చుకోవడం జిల్లాకే గర్వకారణం. గాంధీజీ పలు మార్లు స్వయంగా నెల్లూరుజిల్లాకు విచ్చేసి అనేకమంది స్వాతంత్ర్యయోధులను కలుసుకున్నారు. లక్షలాదిగా ప్రజలను స్వాతంత్ర్యోద్యమం వైపు మళ్ళించారు. అప్పట్లో గాంధీజీ తన పర్యటన ముగించుకుని తిరిగి వెళ్ళిన తర్వాత గాంధీజీ నెల్లూరును ఎంతో ప్రశంసించారంటూ గాంధీజీ కార్యదర్శి ప్యారేలాల్ 'యంగ్ ఇండియా' పత్రికలో తెలియజేశారు కూడా. "ఆంధ్రదేశంలో తాము చేసిన పర్యటనలో తన నెల్లూరు పర్యటనే అగ్రగణ్యమైనదిగా గాంధీజీ పరిగణిస్తున్నారంటూ ఆయన ఆ పత్రికలో పేర్కొన్నారు. హరిజనోద్ధరణకు నిధులను సేకరిస్తున్నప్పుడు అన్ని జిల్లాలకన్నా చాలా ఆలస్యంగా నెల్లూరు పర్యటనకు వచ్చామని, అక్కడ ఆ కార్యక్రమం పెద్దగా జరగదని భావించినప్పటికీ, ఆంధ్రదేశానికంతటికీ ఎక్కువ నిధి నెల్లూరుజిల్లాలో వచ్చిందని స్పష్టం చేశారు. దీంతో స్వాతంత్ర్యోద్యమంలో నెల్లూరు జిల్లా ఖ్యాతి దేశవ్యాప్తంగా దశదిశలా మార్మోగింది.

### ఖద్దరు ప్రచారంలో దేశంలోనే.. నెల్లూరుది అగ్రస్థానం

జిల్లాలో ఖద్దరు ప్రచారం ముమ్మరంగా సాగుతుండేది. గాంధీజీ పిలుపుతో జిల్లాలోని అనేక గ్రామాల్లో మహిళలు రాట్నాలు వడుకుతూ అత్యంత నాణ్యమైన నూలుతో ఖద్దరు వస్త్రాలను ఎంతో నైపుణ్యంతో తయారుచేసేవారు. నెల్లూరు ఖద్దరుకు ఇతర ప్రాంతాల నుండే కాక, పెద్దపెద్ద పట్టణాల నుండి కూడా డిమాండ్ ఉండేది. ఎందరో ప్రముఖులు నెల్లూరు ఖద్దరును వాడేవారు.

అప్పట్లో దేశవ్యాప్తంగా ఖద్దరు ప్రచారంలో భాగంగా గాంధీజీ శిష్యులు శంకర్‌లాల్ బ్యాంకర్ నెల్లూరుజిల్లాకు వచ్చినప్పుడు ఖద్దరు ప్రచారంలో నెల్లూరు అగ్రస్థానంలో ఉందని కొనియాడారు. ముఖ్యంగా, జిల్లాలోని వీరనకనుపూరు, కందుకూరు గ్రామాల్లో వడుకుడు నేత మగ్గాలను ఆయన పరిశీలించి ఖద్దరు నేతలో 'నెల్లూరు ఇండియా కంతటికీ మాంచెస్టర్' అని కితాబిచ్చారు కూడా.

# నెల్లూరుకే మణిమకుటం.. పల్లిపాడు గాంధీజీ అశ్రమం




***1921** ఏప్రిల్ 7వ తేది... జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఏనాటికీ మరువలేని రోజు.. పావన పినాకినీ తీరంలో, నెల్లూరు సమీపంలోని ఇందుకూరుపేట మండలం 'పల్లిపాడు' అనే చిన్న పల్లెలో 'పినాకిని సత్యాగ్రహ ఆశ్రమం' ప్రారంభమైన రోజు.*

మహాత్మగాంధీజీ పల్లిపాడుకు వచ్చి ఆ ఆశ్రమాన్ని తన చేతులమీదుగా ప్రారంభోత్సవం చేయడం జిల్లాలో అపురూపమైన సంఘటన. దేశంలోనే రెండవ సబర్మతి ఆశ్రమంగా పేరొందిన ఈ పినాకిని గాంధీజీ అశ్రమం.. జిల్లాకే గర్వకారణం. గాంధీజీ స్వయంగా జాతీయ మహాసభ నిధుల నుంచి 10వేల రూపాయలు అందజేసి ఈ ఆశ్రమ నిర్మాణానికి తోడ్పాటునివ్వడం విశేషం. దక్షిణాఫ్రికాకు చెందిన గాంధీజీ స్నేహితుడు కూడా మరో 10వేల రూపాయలను ఆశ్రమానికి విరాళంగా అందజేశారు. జిల్లాలో అటు స్వాతంత్ర్యోద్యమాన్ని, ఇటు జమీన్‌దారీ రైతు పోరాటాన్ని జమిలిగా చేతపట్టి ఉద్యమాలకు ఊపిరులూదిన నిప్పుకణిక.. వీరవనిత పొణకా కనకమ్మ ఈ ఆశ్రమ నిర్మాణానికి 20 ఎకరాల స్థలాన్ని కొనుగోలుచేసి ఆశ్రమనిర్మాణ దాతగా చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలచిపోయారు. నెల్లూరులో బాలికల విద్యకోసం పరితపించి, ఎంతగానో పోరాటం చేసి కస్తూరిదేవి విద్యాసంస్థలను నెలకొల్పిన విద్యాదాత కూడా.. ఆ మహనీయురాలే. బాపూజీ అంటే పరమభక్తితో స్వాతంత్ర్యోద్యమంలో చేరి జైలుశిక్షను కూడా అనుభవించింది.. ఆ బంగారుతల్లి. మహాదాత తిక్కవరపు రామిరెడ్డి, ఆయన సతీమణి తిక్కవరపు సుదర్శనమ్మ, స్వాతంత్ర్యయోధులు డా.బెజవాడ గోపాలరెడ్డి, దిగుమర్తి హనుమంతరావు, చతుర్వేదుల వెంకటకృష్ణయ్య, ఖాసా సుబ్బారావు, ఇస్కా చెంచయ్య, రేబాల కృష్ణయ్య, మైపాడుకు చెందిన వెంకటరెడ్డి తదితరులతోపాటు ఎందరో జాతీయ వాదులు, దాతలు ఈ ఆశ్రమం అభివృద్ధికి పాదులు వేశారు.

తల్లి భారతికి వందనం
'అమృతోత్సవ' అభివందనం

నేటితరానికి కూడా ఈ ఆశ్రమం ఎంతో స్ఫూర్తినిస్తోంది. ఇటీవలి కాలంలో నెల్లూరులోని ప్రముఖ వదాన్యులు, రాజ్యసభ సభ్యులు సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరుల అండదండలతో, రెడ్‌క్రాస్ సేవాసంస్థ సౌజన్యంతో శతజయంతి సంబరాలు కూడా జరుపుకుని ఈ ఆశ్రమం అందరికీ ఆదర్శప్రాయంగా ఉంటోంది. నాటి స్వాతంత్ర్యోద్యమ తీరుతెన్నులను, ఘటనలను నేటికీ గుర్తుచేస్తూ... యువతకు, భావితరానికి స్ఫూర్తిదాయకంగా ఉంది.

# కదంతొక్కిన సింహపురి సీమ

రాట్నాలు పెట్టడం వంటి కార్యక్రమాలు జిల్లాలో పెద్దఎత్తున జరుగుతున్నాయి. ఓరుగంటి వెంకటసుబ్బయ్య, ఆమంచర్ల ఆదినారాయణ కావలి ప్రాంతంలో ప్రచారోద్యమాన్ని ప్రారంభించారు. పోట్లపూడిలో పొణకా కనకమ్మ చేతిమగ్గాలను ఏర్పాటుచేసి మహిళలకు రాట్నం వడకడం నేర్పించేవారు. తిక్కవరపు రామిరెడ్డి, వెన్నెలకంటి రాఘవయ్య తదితరులంతా మండలంలో కాంగ్రెస్ కార్యక్రమాలను జోరుగా నిర్వహించేవారు. 1908లోనే నెల్లూరుజిల్లా కాంగ్రెస్ ఏర్పడి ఆమంచర్ల సుబ్బుకృష్ణారావు పంతులు, కెవి రాఘవాచార్యుల నేతృత్వంలో కార్యక్రమాలు ఊపందుకున్నాయి.

స్వాతంత్ర్యయోధులు తమ దినచర్యగా అనునిత్యం వేకువనే గాంధీమహాత్ముని ఘంటానాదంతో నెల్లూరు నగర ప్రజలను మేల్కొలుపుతూ దేశభక్తి గీతాలతో, నగర సంకీర్తనం ప్రారంభించేవారు. అది పూర్తయ్యాక, ఎక్కడ సభ పెట్టాలో అందరూ కలసి నిర్ణయించుకునేవారు. చిత్రకూటంలోనో, లేదా పురమందిరం, ఆంజనేయ స్వామి దేవాలయం ఎక్కడ వీలైతే అక్కడ సభ పెట్టి దేశభక్తిని ప్రబోధిస్తూ ఉద్యమ గీతాలను ఆలపించేవారు. అప్పట్లో కవికోకిల దువ్వూరు రామిరెడ్డి రచించిన దేశభక్తి గీతాలే జిల్లా అంతా మారుమోగుతుండేవి. పల్లెల్లో నెల్లూరు వెంకట్రామానాయుడు రాసిన పాటలు ప్రజల్లో చైతన్యం తెచ్చేవి. రాళ్లపల్లి రామసుబ్బయ్య తదితరులు ఆ పాటలన్ని టినీ నిరంతరం వీధుల్లో పాడుతూ ప్రజలను ఉద్యమాలకు ప్రేరేపించేవారు. 'గాంధీ మహాత్మునకు జై!.. భరతమాతకు జై!.. అంటూ పెద్దసంఖ్యలో ప్రజలు ఆ సభలకు వచ్చేవారు. మద్యపాన నిషేధం, ఖద్దరు ధారణ, అంటరానితనం నిర్మూలన, కల్లు అంగళ్ళ వేలాన్ని బహిష్కరించడం తదితర కార్యక్రమాలు ఉద్యమాల్లో ప్రధానంగా ఉండేవి. 1921లో కల్లు అంగళ్ళ వేలాన్ని బహిష్కరించేందుకు పెద్దఎత్తున పోరాటం చేసి, ఆ ఉద్యమంలో దేశంలోనే నెల్లూరుజిల్లా అగ్రస్థానంలో ఉండి అందరి దృష్టిని ఆకర్షించింది.

## ఖద్దరు ఉద్యమం

గాంధీజీ పిలుపు మేరకు విదేశీ వస్త్రాలను బహిష్కరించడం, దేశీయవస్త్రాలైన ఖద్దరును ప్రోత్సహించడంలో నెల్లూరుజిల్లా ముందువరుసలో నిలిచింది. మగ్గాలు పెట్టడం, రాట్నాలు వడకడం పెద్దఎత్తున వస్త్రాలు నేయడం పెద్ద ఉద్యమంగా రూపు దాల్చింది. నెల్లూరు మండలంలో సన్నని నూలుతో ఖద్దరు తయారీ దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌వాదులను ఆకట్టుకుంది. నూలు వస్త్రాలను తలపై పెట్టుకుని ఓరుగంటి వెంకటసుబ్బయ్య, ఆయన సతీమణి మహాలక్ష్మమ్మ, నవులూరు సుబ్రహ్మణ్యం, ముత్తుకూరు కామమ్మ, మంగళాంబ తదితర స్వాతంత్ర్యయోధులు ఊరూరా తిరిగి అమ్మేవారు. ఆగర్భశ్రీమంతురాలైన తిక్కవరపు రామిరెడ్డి సతీమణి సుదర్శనమ్మ కూడా ఇల్లిల్లూ తిరుగుతూ ఖద్దరు వస్త్రాలను విక్రయించే వారంటే జిల్లాలో ఖద్దరు ఉద్యమం ఎంత గొప్పగా జరిగిందో అర్థమవుతుంది.

## మురిగిపోయిన అన్నం.. ముల్లంగి ఆకుల పులుసు

ఉద్యమాలు ఉధృతం అవుతుండడాన్ని చూసి బ్రిటిష్‌వాళ్ళు స్వాతంత్ర్యయోధులను గాలించి జైళ్లలో పెట్టడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అయినా ఉద్యమకారులు భయపడకుండా జైలుయాత్రలకు సిద్ధమయ్యారు. 1921–22 సంవత్సరాల్లో జిల్లా అంతటా అరెస్టులు జరిగాయి. నెల్లూరు, వెంకటగిరి తదితర ప్రాంతాల్లో మొత్తం 40 మంది యోధులను అరెస్టు చేశారు. వెన్నెలకంటి రాఘవయ్య, కందాడై దొరస్వామి అయ్యంగార్, చతుర్వేదుల రాఘవయ్య, పాటూరు సుబ్బరామయ్య, గూడూరులో దేశిరెడ్డి శేషురెడ్డి, వెంకటగిరిలో కటికనేని సోదరులు కల్యాణరావు–వెంకటరావు తదితర ముఖ్యులంతా జైలుపాలయ్యారు. బ్రిటిష్‌వాళ్లకు పన్నులు కట్టవద్దని ప్రచారం చేస్తుండడంతో రాళ్ళపల్లి రామసుబ్బయ్య, వేమూరు లక్ష్మయ్య, తిక్కవరపు రామిరెడ్డి, అక్బర్ సాహెబ్, ఓరుగంటి వెంకటసుబ్బయ్యలను అరెస్టు చేసి వేలూరు జైలుకి తరలించారు. జైలు శిక్షలు ముగిసి ఇళ్ళకు వచ్చేటప్పటికి జైలులో పడిన హింసలతో నానాబాధలు, రోగాలతో కుమిలిపోయేవారు. జైళ్ళలో బ్రిటిష్ పోలీసులు ఉద్యమకారులకు మురిగిపోయిన ఉప్పుడుబియ్యపు అన్నం, ముల్లంగి ఆకులతో ఉడికీ ఉడకని పులుసు మాత్రమే పెట్టేవారు. వాటిని తినలేక స్వాతంత్ర్యయోధులు పడిన బాధలు వర్ణనాతీతం.

## పూటకూళ్ళ ఇళ్ళకు.. బ్రిటీషోళ్ళ నోటీసులు


ఉద్యమకారులకు బయటకు వచ్చినా వేధింపులు ఆగేవి కావు. ప్రత్యేకించి ఉద్యమాలకు ఊపునిస్తున్న రేబాల పట్టాభిరామిరెడ్డి, సుందరరామిరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి, బత్తిన పెరుమాళ్ళనాయుడు, కొర్రా ఆదిశేషయ్య, లేబూరు సుబ్బరామిరెడ్డి, ఓరుగంటి మహలక్ష్మమ్మ, వేనాటి చెంచుపోలమ్మ, పొణకా కనకమ్మ, ముత్తుకూరు కామమ్మ, వేమూరి లక్ష్మయ్య, శేషురెడ్డి, నాగసూరు వీరరాఘవులు, వేనాటి వెంకటరెడ్డి, ముత్తరాజు గోపాలరావు, వెన్నెలకంటి రాఘవయ్య, కాకు సుబ్బరామరెడ్డి, హనుమారెడ్డి, పార్థసారధి అయ్యంగార్, కటికనేని సోదరులకు ఎవరైనా అన్నం పెట్టారో జాగ్రత్త!.. వారికి వసతి కల్పించినా మీ అంతు చూస్తాం!..అంటూ బ్రిటిష్‌పాలకు పూటకూలి ఇళ్ళవారికి నోటీసులు కూడా ఇచ్చారు. అయినా ఎవరూ ఖాతరు చేయలేదు. నెల్లూరుజిల్లా స్వాతంత్ర్యోద్యమంలో ఇలాంటి సంఘటనలు కోకొల్లలు.

## ఉద్రూతలూగించిన ఉపన్యాసం

### • నెల్లూరులో బిపిన్‌చంద్రపాల్

బిపిన్‌చంద్రపాల్ అంటేనే ఆవేశానికి మారుపేరు. ఆయన ఉపన్యాసాలు ఎంతో ఉద్విగ్నంగా జరిగేవి. స్వాతంత్ర్యోద్యమంలో ఆయన పాత్ర అమోఘం. దేశవ్యాప్తంగా అనర్గళమైన ఉపన్యాసాలతో ప్రజలను ఉద్రూత లూగించేవారు. ఆయన ఉపన్యాసం వింటే చాలు..అన్నీ వదులుకుని తెల్లదొరలపై పోరాటానికి సిద్ధపడకుంటే జీవితం వ్యర్థం కదా అన్నట్లుండేవి. ఎక్కడ సభ పెట్టినా కనీసం పాతికవేలకు తగ్గకుండా జనం వచ్చేవారు. కాంగ్రెస్‌పార్టీ అంతా కలసి పాతికేళ్ళు కష్టించిరాని ప్రజాచైతన్యాన్ని ఆయన ఒక్క సభతోనే కలుగజేసేవారని, ప్రజలను స్వాతంత్ర్యోద్యమానికి కదిలించడంలో ఆయనకున్న అపారమైన ప్రతిభాపాటవాలు అనన్యసామాన్యాలని అప్పట్లో పేరు. అలాంటి ప్రసంగం వినడానికి నెల్లూరుకు కూడా అవకాశం లభించింది. అందుకు టౌన్‌హాల్ వెనుకభాగం వేదికగా మారింది. అంత గొప్పసభకు అధ్యక్షత ఎవరు వహించాలన్న తర్జనభర్జనలు జరిగాక నెల్లూరులో కొత్తగా న్యాయవాద వృత్తిలో చేరిన మాడభూషి నరసింహాచార్యులకి ఆ ఘనత దక్కింది. అధ్యక్షోపన్యాసం అదిరిపోయింది. బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసమైతే ఇక చెప్పనే అక్కరలేదు. రౌలట్ చట్టంపై ఆయన అద్వితీయంగా ప్రసంగిస్తుంటే జయజయధ్వనులు మార్మోగిపోయాయి. ఆ సభకు నెల్లూరుజనం వేలాదిమంది తరలివచ్చారు. బిపిన్ చంద్రపాల్ కూడా మాడభూషి వారి ప్రసంగాన్ని అభినందించారు. ఆ మాడభూషి వారే ఆ తర్వాత కాలంలో నెల్లూరులోని ప్రోగ్రెసివ్ యూనియన్ స్థాపకులలో ఒకరు. మహాత్మాగాంధీజీ నెల్లూరుకు వచ్చినప్పుడు వర్ధమాన సమాజం గ్రంథాలయంలో లోకమాన్య బాలగంగాధర తిలక్ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి గాంధీజీ చేతులమీదుగా ఆవిష్కరింపజేసిన దేశభక్తుడు. నెల్లూరు పర్మనెంట్ ఫండాఫీసుకు కార్యదర్శిగా, విఆర్ కళాశాల కరెస్పాండెంటుగా కూడా మాడభూషి సేవలు చేశారు.

## రాట్నపు పాట



పొద్దుపొడుపూ చుక్క పొడిచింది..రాట్నమా
గూళ్ళలో పక్షులు కూసేను రాట్నమా
అరుణకిరణాలతో ఆటలాడే నూలు
తమ్మికాడలలోని తంతులంటే నూలు
మంచినీళ్ళల్లోన మరగిపొయ్యే నూలు
సాలీడుపోగుతో సరసమాడే నూలు
గాలి తరగలలోన తేలిపొయ్యే నూలు
వడకవే రాట్నమా..వజ్రాల దూది
నడవవే రాట్నమా..నక్షత్రవీధి!...../పొద్దుపొడుపూ/

ముద్దులొల్కే పాట ముత్యాల పాట
పరువునిల్పే పాట బంగారుపాట
మత్తుమాపే పాట మధురంపు పాట
నిద్రలేపే పాట నిద్దంపు పాట
కడుపు నింపే పాట కనికరపు పాట
పాడవే రాట్నమా భావిభారతము
ఆడవే రాట్నమా యాంధ్రనాటకము../పొద్దుపొడుపూ/

కట్ట గుడ్డా లేక కటకటాపడుచు
కుడువ కూడూ లేక గోడుగోడనుచు
దాస్య వారాశిలో దరిగాన లేక
బెదరిబెదరీ చూచు పిరికిపందలను
ఆత్మనిందలతోడ నడలు బేలలను
పురికొల్ప శంఖంబు పూరించి రేపి
తిప్పవే రాట్నమా దేశచక్రంబు
విప్పవే రాట్నమా విజయకేతనము../పొద్దుపొడుపూ/

(ఇది స్వాతంత్ర్యోద్యమంలో ప్రఖ్యాతిచెందిన పాట)



రచన:
కవికోకిల
దువ్వూరు రామిరెడ్డి

# సింహాలై గర్జించిన..నెల్లూరు వీరనారీమణులు

**పోరాటాలకు పురిటిగడ్డ..ఉద్యమాలకు ఉగ్గుపాలు పోసి పెంచిన నెల్లూరుజిల్లాలో.. స్వాతంత్ర్యసమరంలోనూ పురుషులతో పాటు ధీటుగా పాల్గొని కదంతొక్కి సింహాలై గర్జించిన వీరనారీమణులెందరో ఉన్నారు. మహాత్మాగాంధీజీ పిలుపుకు స్పందించి భరతమాత దాస్య విముక్తికోసం కుటుంబాలను వదిలిపెట్టి, పోరుబాట పట్టి, చెప్పలేనన్ని కష్టనష్టాలకోర్చి, దేశ స్వాతంత్ర్యసముపార్జనే జీవితధ్యేయంగా కదనరంగానికి బయలుదేరారు. జమీందారు కుటుంబాల్లో పుట్టినవారు కూడా వీధుల్లోకొచ్చి 'వందేమాతరం' అంటూ నినదించారు. అంతులేని దేశభక్తితో ఉద్యమాలను ముందుండి నడిపించారు. నెల్లూరుజిల్లా చరిత్రలో చిరస్మరణీయమైన స్థానాన్ని అలంకరించారు. ఆ మహిళాయోధుల స్ఫూర్తిదీప్తులతో నెల్లూరుజిల్లా నేటికీ మరింత ప్రకాశమానమవుతూనే ఉంది.**

స్వాతంత్ర్యోద్యమంలో జిల్లా మహిళల పోరాటం ఒక ప్రత్యేక అధ్యాయమనే చెప్పాలి. నిప్పుకణిక పొణకా కనకమ్మ, పాటూరు బాలసరస్వతమ్మ, దిగుమర్తి బుచ్చికృష్ణమ్మ, తిక్కవరపు సుదర్శనమ్మ, దొడ్ల రుక్మిణమ్మ, ఓరుగంటి మహలక్ష్మమ్మ, కోబాక రుక్మిణమ్మ, అల్లాడి అన్నపూర్ణమ్మ తదితరులెందరో ఉద్యమాలకు ముందు వరుసలో నిలిచారు. ఎందరో మహిళలు ఆ రోజుల్లో ధైర్యంగా వీధుల్లోకొచ్చి ఉద్యమకేతనాలు ఎగురవేశారు. జిల్లాలోని మహిళలందరినీ చైతన్యవంతం చేస్తూ ఉద్యమాల్లో నడిపించారు.

## పొణకా కనకమ్మ :

ధీరవనిత పొణకా కనకమ్మ 1913 ప్రాంతంలోనే జిల్లాలోని పోట్లపూడిలో సుజనరంజని సమాజాన్ని నెలకొల్పి పోట్లపూడిని పోరుగడ్డగా మార్చారు. స్త్రీలకు చదువు, సాహిత్యంపై మక్కువ కల్పించడంతో పాటు దేశభక్తిని, జాతీయభావాలను పెంపొందించారు. నెల్లూరు నగరంలో వేకువనే నగర సంకీర్తన జరిగేది. దేశభక్తి గీతాలు, దైవభక్తితో భజనలతో వీధులన్నీ ఉద్యమసందడితో నిండిపోయేవి. మహిళలు పెద్దసంఖ్యలో ఆ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. జాతీయభావాలతో కనకమ్మ వీధివీధినా చేసే ప్రసంగాలు అందరినీ బాగా ఆకట్టుకునేవి. గొప్ప ధనవంతురాలై ఉండి కూడా దేశం కోసం వీధుల్లోకొచ్చి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ఆమెను చూసి ఎందరో మహిళలు స్ఫూర్తిపొంది ఉద్యమంలో చేరేవారు. ఆమె ప్రసంగాలు రాష్ట్రవ్యాప్తంగా సాగేవి. ఉత్తరాంధ్రలో మహిళా సంఘాల వారంతా కనకమ్మను పిలపించుకుని తమ ప్రాంతాల్లో ఉపన్యాసాలు చెప్పించేవారంటే ఆ మహనీయురాలి ప్రతిభా విశేషాలు ఎంత ఘనమైనవో తెలుస్తుంది. ఆమె ఇంట్లోనే రాట్నాలు పెట్టుకుని నూలు వడుకుతూ దేశభక్తి పాటలు పాడేవారు. మహిళలకు ప్రత్యేకించి కాంగ్రెస్ విభాగం ఉండాలని వాదించి మహిళా కాంగ్రెస్ ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. స్వాతంత్ర్యోద్యమంలో లాఠీదెబ్బలు తిన్నారు. కఠినాతికఠినమైన జైలుశిక్షలు కూడా అనుభవించారు. గాంధీజీ అంటే కనకమ్మకు ఎనలేని భక్తి. నెల్లూరుకు వచ్చిన మహాత్మాగాంధీజీకి జాతీయోద్యమ నిధిగా తన వంటిమీదున్న బంగారాన్నంతా వలిచి ఇచ్చిన దేశభక్తురాలు ఆమె. 1921లో పల్లిపాడులో సత్యాగ్రహాశ్రమానికి స్థలమిచ్చి ఆశ్రమ నిర్మాణ దాతగా నిలవడమే కాక, ఆశ్రమం అభివృద్ధికి ఎంతో కృషిచేశారు. పల్లిపాడులో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు పాలైందామె. 1930 జులై7న కనకమ్మను బ్రిటిష్ పోలీసులు అరెస్టు చేసి నెల్లూరు జైలులో నిర్బంధించారు. శిక్ష అనుభవించి వచ్చాక మరింత పోరాట స్ఫూర్తితో ఆమె ఉద్యమాల్లోకి నడిచారు. 1932లో శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని సారా దుకాణాల వద్ద పికెటింగ్ చేస్తుండగా పోలీసులు ఆమెను లాఠీలతో కొట్టారు. భుజం మీద పెద్ద దెబ్బ తగిలింది. తీవ్రంగా గాయపడినప్పటికీ ఆమె బెదరలేదు. మహిళలందరికీ స్ఫూర్తిగా నిలిచిన ఆమెను పోలీసులు వెల్లూరు జైలుకు తరలించారు ఒకటిన్నర సంవత్సరం పాటు ఆమె ఆ జైలులో శిక్ష అనుభవించారు. అంతేకాదు, రైతులను అష్టకష్టాల పాలుచేస్తున్న జమీన్దారీ వ్యవస్థ రద్దుకావాలంటూ జిల్లాలో ఆమె పెద్ద పోరాటమే చేశారు. ఆ పోరాటంలోనూ ఆమె పడిన కష్టాలకు లెక్కేలేదు. నెల్లూరు జిల్లా కాంగ్రెస్‌కు తొలి మహిళా అధ్యక్షురాలిగా ఉంటూ జాతీయోద్యమంలో మహిళలు పాల్గొనేలా ఎన్నో సభలు, కార్యక్రమాలు నిర్వహించారామె. అటు స్వాతంత్ర్యోద్యమం, ఇటు జమీన్దారీరైతు పోరాటంతో పాటు మరోవైపు మహిళల చదువుకోసం ఉద్యమించి పడరాని పాట్లు పడ్డారు. మహిళలకు, బాలికలకు చదువెంతో అవసరమని, వారి విద్యకోసం ఆమె పడిన తాపత్రయం అంతా ఇంతా కాదు.

నెల్లూరులో కస్తూరిదేవి విద్యాలయం నెలకొల్పి బాలికలు చక్కగా చదువుకునేందుకు ఆమె అన్ని ఏర్పాట్లు చేశారు. ఆడపిల్లలను బడికి పంపడానికి తల్లితండ్రులు ససేమిరా ఒప్పుకోని ఆరోజుల్లో వారందరికీ నచ్చజెప్పి ఎందరో పేద బాలికలను బడిబాట పట్టించి చదువు చెప్పించిన ఘనత ఒక్క కనకమ్మకే దక్కింది. మహాదాత తిక్కవరపు రామిరెడ్డి తదితర దాతల సాయంతో ఆ విద్యాలయం అభివృద్ధికి ఆమె బాటలు వేశారు. నెల్లూరులో నేటికీ కస్తూరిదేవి విద్యాలయం కనకమ్మ సేవలకు గుర్తుగా వేలాదిమంది బాలికలకు చదువు చెప్తూనే ఉంది.

## వీరమాతలను కన్న గడ్డ.. సింహపురి సీమ

నెల్లూరుజిల్లా అంటేనే వీరమాతలను కన్న గడ్డ. ఎందరో ధీరవనితలకు పుట్టినిల్లు నెల్లూరు. స్వాతంత్ర్యోద్యమంలో వారు చేసిన త్యాగాలు మహనీయం..మార్గదర్శకం. నెల్లూరులోని స్వాతంత్ర్యయోధుడు పాటూరు సుబ్బరామయ్య సతీమణి పాటూరు బాలసరస్వతమ్మ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు. కల్లు మానండంటూ కల్లు దుకాణాల వద్ద పికెటింగ్‌లు నిర్వహించారు. విదేశీవస్త్రాల బహిష్కరణ ఉద్యమంలో పాల్గొన్నారు. గాంధీజీ హరిజన ఉద్యమనిధికి విరాళాలు అడిగినప్పుడు వంటిమీద ఉన్న నగలన్నీ వొలిచి ఇచ్చేశారు. 1921లో సహాయ నిరాకరణోద్యమంలోనూ, 1930లో ఉప్పు సత్యాగ్రహంలోనూ పాల్గొని జైలుశిక్షలు కూడా అనుభవించారామె. అదేవిధంగా, వెంకటగిరికి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు కోబాక రుక్మిణమ్మ కాంగ్రెస్ సభల్లో ఎంతో ఉత్తేజితంగా దేశభక్తిగీతాలు ఆలపించేవారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో కూడా ఆమె పాల్గొని జైలు పాలయ్యారు. ఓరుగంటి వెంకటసుబ్బయ్య సతీమణి ఓరుగంటి మహలక్ష్మమ్మ కూడా స్వాతంత్ర్యోద్యమంలో జైలు శిక్ష అనుభవించారు. బుచ్చిరెడ్డిపాళెంలో గొప్ప జమీందారులైన దొడ్ల వారి సంస్థానానికి చెందిన దొడ్ల రుక్మిణమ్మ తాను స్వాతంత్ర్యోద్యమంలోకి రావడమే కాక, ఎంతోమంది మహిళలు ఉద్యమంలో చేరే విధంగా ఎనలేని కృషిచేశారు. 1933లో గాంధీజీని తమ బంగళాకు ఆహ్వానించి తమ నివాసంలోనే పెద్దఎత్తున మహిళలతో సభ నిర్వహించి సంచలనం సృష్టించారామె. హరిజన నిధి కోసం విరాళాలివ్వాలని గాంధీజీ కోరగానే తన మెడలోని బంగారు ఆభరణాలను సంతోషంగా తీసిచ్చి తన దేశభక్తిని చాటుకున్న మహనీయురాలు దొడ్ల రుక్మిణమ్మ. ఇలా ఎంతోమంది వీరనారీమణులు తమ శక్త్యానుసారం ఉద్యమాలకు చేయూతనిచ్చారు. అల్లాడి అన్నపూర్ణమ్మ జిల్లాలో హరిజనోద్ధరణకు కంకణం కట్టుకుని, జిల్లాఅంతటా మారుమూల గ్రామాల్లో సైతం తిరిగి ప్రజలను చైతన్యవంతం చేశారు. బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన మహోన్నత నేత, ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధుడు డా.బెజవాడ గోపాలరెడ్డి సతీమణి బెజవాడ లక్ష్మీకాంతమ్మ కూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. వ్యష్టి సత్యాగ్రహంలో జైలుశిక్ష కూడా అనుభవించారు. ఓరుగంట వెంకటసుబ్బయ్య కుమార్తె మైత్రేయి ఉద్యమగీతాలను అద్భుతంగా, ఎంతో ఉత్తేజితంగా పాడేవారు. ఇలా..స్వాతంత్ర్యయోధులతో పాటు వారి కుటుంబసభ్యులు కూడా ఉద్యమాల్లో పాల్గొని భరతమాత ముద్దుబిడ్డలుగా స్వాతంత్ర్యశంఖారావం పూరించారు. ఆ వీరమాతలందరికీ జేజేలు!

## నెల్లూరుజిల్లాలో..
## 5 సార్లు పర్యటించిన గాంధీజీ

స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా నెల్లూరుజిల్లాలో అయిదు సార్లు మహాత్ముడు పర్యటించి ప్రజలను జాతీయోద్యమానికి కదిలించారు. 1915 మే నెలలో నెల్లూరులో రావుబహుదూర్ రేబాల లక్ష్మీనరసారెడ్డి టౌన్‌హాలు (పురమందిరం) కట్టించినప్పుడు మొదటి సారిగా అక్కడ జరిగింది మద్రాసు రాష్ట్రీయ మహాసభే. ఆ సభకు మహాత్మా గాంధీ వచ్చారు. వేలాదిమంది ప్రజలు, నెల్లూరు ప్రముఖులు తరలివచ్చారు. అప్పట్లో జిల్లా కలెక్టర్ రామచంద్రరావు నివాసంలో గాంధీజీ బసచేశారు. తొలిసారిగా గాంధీజీ రాకతో నెల్లూరు ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి మహాత్ముని దర్శించుకున్నారు. ఆ తర్వాత మరో నాలుగుసార్లు వివిధ కార్యక్రమాల సందర్భంగా గాంధీజీ వచ్చారు. మహాత్ముడంటే నెల్లూరు ప్రజలకు అమితభక్తి. నెల్లూరుకు గాంధీజీ ఎప్పుడు వచ్చినా వేలాదిమంది ప్రజలు తరలివచ్చి గాంధీజీ ప్రసంగాలను ఎంతో ఆసక్తిగా వినేవారు. అడుగడుగునా ప్రజలు మహాత్మునికి బ్రహ్మరథం పట్టేవారు.



1921లో కోస్తా జిల్లాల పర్యటనలో భాగంగా గాంధీజీ రెండవసారి నెల్లూరుకు వచ్చారు. అప్పుడు ఆయన వెంట కస్తూర్బా గాంధీ కూడా ఉన్నారు. నెల్లూరులోని ప్రముఖ దాత, స్వాతంత్ర్య సమరయోధుడు తిక్కవరపు రామిరెడ్డి బంగ్లాలో వారు బసచేశారు. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో 'తిలక్ గ్రంథాలయం' ప్రారంభించారు. పల్లిపాడులో పినాకిని సత్యాగ్రహాశ్రమానికి గాంధీజీ ప్రారంభోత్సవం చేశారు. 1929 మే నెలలో శాసనోల్లంఘన ఉద్యమం సందర్భంలో మూడవసారి నెల్లూరుజిల్లా పర్యటనకు వచ్చారు. నెల్లూరులో కస్తూరిదేవి విద్యాలయానికి గాంధీజీ శంకుస్థాపన చేశారు.

1933 డిసెంబర్‌లో హరిజన నిధికి విరాళాలు సేకరించేందుకు మహాత్ముడు నెల్లూరుజిల్లాకు వచ్చారు. అనేక సభల్లో ఆయన ప్రసంగించి ప్రజలను ఉత్తేజితుల్ని చేశారు. జిల్లా ప్రజలు, వదాన్యులు హరిజన నిధికి తమ శక్తిమేరా విరాళాలు అందజేశారు.

1946 జనవరిలో చివరిసారిగా 5వ సారి గాంధీజీ నెల్లూరుజిల్లాకు వచ్చి అనేకమంది స్వాతంత్ర్యయోధులతో మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటాన్ని మరింతగా ఉరకలెత్తించారు.

గాంధీజీకి నెల్లూరుజిల్లాతో ఎంతో అనుబంధం ఉండేది. ఇక్కడి ఉద్యమ విషయాలను ఆయన ఎప్పటికప్పుడు తెలుసుకుంటుండేవారు. అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తుండేవారు. పల్లిపాడు ఆశ్రమ నిర్వహణలో ప్రముఖపాత్ర వహించిన సమరయోధుడు దిగుమర్తి హనుమంతరావు, అకుంఠిత దేశభక్తుడు శ్రీ పొట్టి శ్రీరాములు, స్వాతంత్ర్యసమరయోధులు పొణకా కనకమ్మ, వెన్నెలకంటి రాఘవయ్య తదితరులతో గాంధీజీ ఉత్తరప్రత్యుత్తరాలు జరిగేవి. జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఇవన్నీ ఉన్నాయి. ఇలాంటి వన్నీ ఏనాటికీ మరచిపోని.. ఎప్పటికీ మరువరాని సంఘటనలే.

## ఎక్కడ చూసినా స్వాతంత్ర్య సమరోత్సాహమే

జిల్లాలో స్వాతంత్ర్యోద్యమానికి నారువేసి నీరుపోసి పెంచిన మహనీయులెందరో ఉన్నారు. దేశమాత విముక్తి కోసం ధనికుల నుంచి సామాన్య ప్రజల వరకు బ్రిటిష్‌వారి కర్కశత్వాలకు భయపడకుండా జైళ్ళకు వెరవకుండా, ఎంతోమంది నిర్భయంగా ముందుకు వచ్చారు. జిల్లా అంతటా ఎక్కడ చూసినా స్వాతంత్ర్య సమరోత్సాహమే. నెల్లూరులో డా.బెజవాడ గోపాలరెడ్డి, వెన్నెలకంటి రాఘవయ్య, పొణకా కనకమ్మ, తిక్కవరపు రామిరెడ్డి వంటి దిగ్గజాలుంటే, కావలి వైపు నుంచి ఓరుగంటి వెంకటసుబ్బయ్య, గూడూరు నుంచి దేశిరెడ్డి శేషరెడ్డి, జి.వీరసుబ్రహ్మణ్యం, ఆత్మకూరు ప్రాంతం నుంచి జిసి కొండయ్య, వెంకటగిరి ప్రాంతం నుంచి కటికనేని సోదరులు, కోటపోలూరు నుంచి బద్దెపూడి వెంకటనారాయణరెడ్డి, కోవూరు నుంచి బసావారెడ్డి శంకరయ్య, సముద్రతీర ప్రాంతం మైపాడు నుంచి దువ్వూరి బలరామిరెడ్డి, అల్లూరు నుంచి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బత్తిన రామకృష్ణారెడ్డి ఇలా ఒకచోటనేమిటి అన్ని ప్రాంతాల నుంచి ఎందరో యోధులు స్వాతంత్ర్య పోరాటానికి నడుం బిగించారు. పాటలు పాడినందుకు, దేశభక్తి మాటలు చెప్పినందుకు కూడా అరెస్టయ్యారు. ఎన్నో కష్టాలు పడ్డారు. భార్యాబిడ్డలు, కుటుంబాలతో సహా ఎన్నెన్నో బాధలు పడ్డారు. వారి త్యాగాలకు ఇక లెక్కేలేదు. వారి ధైర్యసాహసాలు వర్ణించడానికి మాటల్లేవు. చెక్కుచెదరని గుండె నిబ్బరంతో, అమేయమైన దేశభక్తితో దేశమాత దాస్యవిముక్తికి జీవితాలనే అంకితం చేసిన మహనీయులెందరో ఉన్నారు. వారందరికీ పేరుపేరునా ఇవే.. 'లాయర్'.. అక్షరాభివందనాలు!

# త్యాగమయుడు.. శ్రీ పొట్టి శ్రీరాములు



గాంధీజీకి పరమభక్తుడు, పరమ సాత్వికుడు.. అత్యంత నిరాడంబరుడు, నిష్కళంక దేశభక్తుడు.. శ్రీ పొట్టి శ్రీరాములు. గాంధీజీ నిర్వహిస్తున్న సబర్మతి ఆశ్రమంలో ఉంటూ గాంధీజీ బోధనలతో ప్రభావితులై సమాజసేవకు కంకణం కట్టుకున్న మహనీయులాయన. నెల్లూరుజిల్లాకు వచ్చి అంటరానితనం నిర్మూలనకు, హరిజనులు దేవాలయ ప్రవేశానికి ఆయన చేసిన కృషి అపూర్వం. అందుకోసం ఎన్నోసార్లు ఆయన నిరసనవ్రతం చేపట్టారు. 'అంటరానితనం నిర్మూలించండి -హరిజనులకు దేవాలయ ప్రవేశం కల్పించండి.. అంటూ రాసిన రెండు అట్టలను మెడకు ఒకటి, వీపుకు ఒకటి తగిలించుకుని తిరుగుతుండేవారు. ఎవరు ఎగతాళి చేసినా పట్టించుకునేవారు కాదు. భిక్షువు వలె తిరుగుతూ యాచన చేసి బియ్యం తెచ్చి ఆ బియ్యాన్ని వండి పేదలకు పెట్టేవారు. గాంధీజీ కూడా పొట్టి శ్రీరాములు చేపట్టిన కార్యక్రమాలను, సేవలను ప్రశంసిస్తూ పలు సభల్లో ప్రస్తావించేవారు. స్వాతంత్ర్యోద్యమంలో తాను నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాలను గాంధీజీకి ఉత్తరాలు రాసి మహాత్ముని సూచనల ప్రకారమే చేసేవారు. వ్యష్టి సత్యాగ్రహంలో పాల్గొని అలీపూర్ సెంట్రల్‌జైలులో కఠిన కారాగార శిక్ష అనుభవించారు. ఆ తర్వాత కాలంలో, తెలుగు వాళ్ళకి ప్రత్యేక రాష్ట్రం ఉంటేనే గౌరవంగా ఉంటుందని భావించి, ఆంధ్రరాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహారదీక్ష చేసి తన లక్ష్యసాధన కోసం చివరికి ఆత్మబలిదానం గావించిన త్యాగమయుడు.. శ్రీ పొట్టి శ్రీరాములు. ఆయన పేరుమీదే ఈ జిల్లాకు 'శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా'గా నామకరణం జరిగింది. ఆ మహనీయునికివే నమోవాకాలు!...

# నిష్కళంక దేశభక్తుడు.. రాళ్ళపల్లి రామసుబ్బయ్య



రాళ్ళపల్లి రామసుబ్బయ్య అంటే పాత కాలంలో నెల్లూరీయులందరికీ సుపరిచితమే. నేటికీ నెల్లూరులో 'ఆర్ఆర్ స్ట్రీట్' అంటే రాళ్ళపల్లి రామసుబ్బయ్య గారి వీధిగా ప్రఖ్యాతం. స్వాతంత్ర్యోద్యమంలో కవికోకిల దువ్వూరు రామిరెడ్డి రాసిన దేశభక్తి గీతాలను వీధుల్లో పాడుతూ ఆ పాటలకు ఆయనెంతో ప్రఖ్యాతిని తెచ్చారు. 'పొద్దు పొడుపూ చుక్క పొడిచింది రాట్నమా!.. గూళ్లలో పక్షులూ కూసేను రాట్నమా!'.. అనే పాట వినిపించిందంటే చాలు..రాళ్ళపల్లి రామసుబ్బయ్య అక్కడికి వచ్చేసినట్లే. దేశభక్తి పాటలు పాడుతూ, జాతీయతా భావాలతో ఉపన్యాసాలు చెప్పడం ఆయన దినచర్య. ఎంతో నిరాడంబరులాయన. మొలకో చిన్న పంచె, పైన తుండుగుడ్డ మాత్రమే వేసుకునేవారు. గాంధీజీకి పరమభక్తుడు. ఉద్యమ ప్రచారాల్లో ఘటనాఘటన సమర్థుడు. ఒకసారి ఆయన్ను జైలు నుంచి విడుదలచేసే సందర్భంలో బ్రిటిష్‌వాళ్లు ఆయనకు ఓ నెల శిక్ష తగ్గించి బయటకు పంపితే, మీ దయ ఎవరికి కావాలంటూ, ఆ నెల శిక్షను ఆయనే నెత్తినేసుకుని ఇంటివద్ద జైలులో ఉన్నట్లుగానే మూకుడన్నం, ముంతతో నీళ్లు తాగి మౌనవ్రతం పాటించడం ఆయన దేశభక్తికి నిదర్శనం. పొణకా కనకమ్మ స్థాపించిన నెల్లూరులోని కస్తూరిదేవి విద్యాలయానికి హెడ్మాస్టరుగా ఉంటూ నిరుపేద పిల్లలెందరికో విద్యాబుద్ధులు నేర్పారు. ఆయన చేతిలో ఉన్న చిన్న సంచిలో ఎప్పుడూ అద్దం, దువ్వెన, కుంకుమ ఉండేవి. బడికి వచ్చిన పేద ఆడపిల్లలు చక్కగా తలదువ్వుకుని బొట్టుపెట్టుకుని ఉండాలని వారికోసం వాటిని ఎప్పుడూ తన వద్ద ఉంచుకునేవారు. పిల్లలకు ప్రార్థన పాటలు, దేశభక్తి గీతాలు నేర్పేవారు. బ్రిటిష్‌వాళ్లు ఆ నిష్కళంక దేశభక్తుడిని పలుసార్లు అరెస్టు చేసి జైలులో నిర్బంధించారు. అయినా ఆయన పోరాటం మాత్రం మానలేదు.

## స్వాతంత్ర్య వీరులు

# వేమూరు లక్ష్మయ్య, బత్తిన రామకృష్ణారెడ్డి

అల్లూరుకు చెందిన వేమూరు లక్ష్మయ్య కూడా వెన్నెలకంటి రాఘవయ్యతో కలిసి ఉద్యమాల్లో పాల్గొన్నారు. సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని కారాగారవాసం అనుభవించారు. గోగులపల్లిలో సత్యాగ్రహ శిబిరం నడిపినందుకు 5 నెలలపాటు జైలుశిక్ష పడింది. రాజమండ్రి, వేలూరు జైళ్లలో ఆయన నిర్బంధించబడ్డారు.

అదేవిధంగా అల్లూరుకు చెందిన మరో స్వాతంత్ర్య సమరయోధుడు బత్తిన రామకృష్ణారెడ్డి. గాంధీజీ పిలుపుతో స్పందించి చదువుకు స్వస్తిచెప్పి 1921లోనే స్వాతంత్ర్య సంగ్రామంలోకి దిగారు. సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో బెజవాడ గోపాలరెడ్డి నాయకత్వంలో బొమ్మా శేషురెడ్డి, లేబూరు సుబ్బరామిరెడ్డి, దువ్వూరు బలరామిరెడ్డి, బత్తిన రామకృష్ణారెడ్డి తదితరులంతా పెద్ద ఉద్యమంగా కదిలారు. ప్రజలు కూడా పెద్దసంఖ్యలో వచ్చారు. పోలీసులు దొరికిన వారిని దొరికినట్లు అరెస్టులు చేశారు. మైపాడు సముద్రతీరంలో ఉప్పు తయారుచేసి అరెస్టయిన జిల్లా తొలి సత్యాగ్రహ దళం సభ్యుడు రామకృష్ణారెడ్డి. 1930 మే 27న ఆయనకు బ్రిటిష్‌వాళ్ళు 3 నెలల జైలుశిక్ష విధించి వెల్లూరు జైల్లో పెట్టారు. 1942లో క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. ఆవేశంతో మిలిటెంటు పోరాటానికి సిద్ధమైన బత్తిన, అల్లూరు పోలీస్‌స్టేషన్ తగులబెట్టే ప్రయత్నానికి కూడా నాయకత్వం వహించాడు. దీంతో 1942 నుంచి 1944 దాకా ఆయన్ను బ్రిటిష్ ప్రభుత్వం జైలుశిక్షలు విధించి వెల్లూరు, తంజావూరు జైళ్లలో పెట్టి చిత్రహింసలు పెట్టింది.

75 తల్లి భారతికి వందనం 'అమృతోత్సవ' అభివందనం

## మన స్వాతంత్ర్యయోధులు




# ఉక్కుమనిషి ఏసి సుబ్బారెడ్డి

ఉక్కుమనిషిగా పేరొందిన ఏసి సుబ్బారెడ్డి (ఆనం చెంచు సుబ్బారెడ్డి) తొలి నుంచి జాతీయవాది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో కాంగ్రెస్ సేవకు నడుం బిగించి జాతీయ భావాలతో ప్రజలను ఉత్తేజితుల్ని చేసే కార్యక్రమాలెన్నో చేపట్టారు. గాంధీ అంటే పంచప్రాణాలు. ప్రత్యేకించి గాంధీజీ జన్మ దినోత్సవాలను రాష్ట్రంలో మరెక్కడా జరగనంత ఘనంగా ఆయన నిర్వహించిన ఖ్యాతిని దక్కించుకున్నారు. గ్రామాల్లో ఎద్దుల బండ్లు కట్టించి, మహాత్ముని చిత్రపటాలను ఆ బండ్లలో పెద్దఎత్తున జిల్లా అంతా ఊరేగించేవారు. గాంధీజీ జన్మదినోత్సవం నాడు వేలాదిమందికి అన్నదానం చేసేవారు. ప్రజానాయకునిగా పేరొందారు. 1938లో కాంగ్రెస్‌లో చేరిన ఏసి సుబ్బారెడ్డి, మహాత్మాగాంధీజీ పిలుపు మేరకు 1941 వ్యష్టి సత్యాగ్రహంలో పాల్గొన్నారు. ఉద్యమాల్లో పాల్గొన్నందుకు ఆయన్ను బ్రిటిష్‌వాళ్ళు అరెస్టుచేసి వెల్లూరు, అలీపూర్ జైళ్లల్లో కఠిన కారాగారవాస శిక్ష విధించారు.

# నెల్లూరు 'నగరజ్యోతి' గోడ పత్రిక

నెల్లూరు నగరంలో గోడపత్రిక స్వాతంత్ర్యోద్యమంలో కీలకపాత్ర పోషించింది. ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఆ గోడమీద రాసి ఉన్న సమాచారాన్ని చదువుకుని తదుపరి ఉద్యమ కార్యక్రమాలకు సమాయత్తమయ్యేవారు. అలాంటి గోడపత్రిక ఒకటి నెల్లూరులో ఉండడం దేశంలోనే అరుదైన విషయంగా చరిత్రలో కెక్కింది. ప్రజలకు ఎప్పటికప్పుడు ఉద్యమ సమాచారం తెలియడం కోసం తిప్పరాజు వారివీధిలో ఉన్న సత్రం గోడపై చాక్‌పీసులతో పత్రికల్లోని సమాచారాన్ని రాసేవారు. అది ఉద్యమకారులకు ఎంతో ఉపయోగపడేది. ఆ మహత్కార్యాన్ని నిర్వహించిన వారు తూములూరు పద్మనాభయ్య. 1921లో బ్రిటిష్‌వారి వద్ద పోలీస్ సబ్ ఇన్స్‌పెక్టర్‌గా ఉన్న పద్మనాభయ్య, దేశభక్తితో ఆ ఉద్యోగానికి రాజీనామా గోకేసి ఉద్యమాల్లో దిగారు. 'టైమ్స్‌ఆఫ్ ఇండియా' పత్రికవారు కూడా పద్మనాభయ్య సేవలను, గోడపత్రిక రాతలను ఎంతగానో ప్రశంసించడంతో 'గోడపత్రిక' ఖ్యాతి దేశవ్యాప్తంగా మారుమోగిపోయింది. 1931లో సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహంలోనూ పద్మనాభయ్య పాల్గొని జైలుపాలయ్యారు.

# యానాదుల దేవుడయ్య.. వెన్నెలకంటి రాఘవయ్య



వెన్నెలకంటి రాఘవయ్యంటే... యానాదుల దేవుడిగా ప్రసిద్ధి. ఆదిమ జాతుల సముద్ధరణకు ఆయన చేసిన పోరాటం అంతా ఇంతా కాదు. ఒకవైపు స్వాతంత్ర్యోద్యమం, మరోవైపు జమీన్‌దారీ రైతు ఉద్యమంలో పాల్గొంటూనే దీనజనుల సేవ కోసం జీవితమంతా ఖర్చుచేసిన మహనీయుడు ఆయన. అల్లూరు మండలం, సింగపేట అనే చిన్నగ్రామంలో పుట్టి, విద్యార్థి దశలోనే 'వందేమాతరం.. మనదే రాజ్యం' అంటూ స్వాతంత్ర్యోద్యమంలోకి దూకి గాంధీజీ పిలుపుతో ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారు. జిల్లాలో ఆయన లేని, ఆయన పాల్గొనని ఉద్యమమంటూ ఏదీ ఉండేది కాదు. పోరాటమే ఊపిరిగా దేశస్వాతంత్ర్యం కోసం ఆయన నిరంతరం కృషిచేశారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. పొణకా కనకమ్మ, బెజవాడ గోపాలరెడ్డి వంటి స్వాతంత్ర్యయోధులతో కలసి ఉద్యమ కేతనం ఎగురవేశారు. 1921లో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా ఉంటూ ఆ తర్వాతకాలంలో రాష్ట్రకాంగ్రెస్ సభ్యునిగా, అఖిలభారత కాంగ్రెస్ సభ్యునిగా కూడా అమోఘమైన సేవలుచేసి కాంగ్రెస్‌సేవలో జీవితాంతం తరించారు. మద్రాసులో న్యాయవాద విద్య పూర్తిచేసి నెల్లూరుకు వచ్చి న్యాయవాదిగా ఉంటూ ఉద్యమకారుల తరఫున వాదించేవారు. జమీన్‌దారీ రైతుల మీద పెట్టిన వందలాది క్రిమినల్ కేసుల్లో రైతుల పక్షాన వాదించి వారికి మేలు చేశారు. బ్రిటిష్‌వారు అత్యంత దుర్మార్గంగా యానాదులపై అమలుచేసిన 'సిటీ యాక్ట్' (క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్)ను రద్దు చేయించాలని పోరాడి దాని పీడ వదిలించారు. కూలిముంతల విధానాన్ని తీసివేయించారు. దీంతో ఆయన యానాదులకు దేవుడయ్యారు. 1930లో ఉప్పు సత్యాగ్రహం లోను, 1940లో వ్యష్టి సత్యాగ్రహం, 1942లో క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని నాలుగేళ్ల 9 నెలల పాటు జైలుశిక్షలు అనుభవించారు. దేశభక్తితో జీవిస్తూ సమాజసేవకే జీవితాన్ని అంకితం చేశారు.

# పోరాటయోధుడు.. అల్లూరు రంగారెడ్డి



భరతమాత దాస్యశృంఖలాలను తెగదెంచడానికి అచంచల దేశభక్తితో తమ జీవితాలను జైళ్ళకు అంకితం చేసిన స్వాతంత్ర్యసమర యోధుల్లో నెల్లూరుజిల్లా అల్లూరుకు చెందిన 'అల్లూరు రంగారెడ్డి' ఒకరు. 1917 మార్చి 20వ తేదిన ఆయన జన్మించారు. చిన్ననాటినుంచే జాతీయభావాలతో ఎదిగారు. 1930 ప్రాంతంలో నెల్లూరు విఆర్ హైస్కూల్‌లో ఫోర్త్ ఫారమ్ చదువుతున్న రోజుల్లోనే స్వాతంత్ర్యోద్యమం వైపు మళ్ళారు. బ్రిటిష్ పాలకుల దౌష్ట్యాలకు ఎదురొడ్డి నిలిచేందుకు పోరాటరంగంలోకి దిగారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని బ్రిటిష్ పోలీసుల చేతిలో లాఠీదెబ్బలు తిన్నారు. ఉద్యమంలో ఉరకలెత్తుతున్న రంగారెడ్డిని పోలీసులు అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఆ తర్వాత కమ్యూనిస్టు నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య సాహచర్యంతో ఉద్యమాలకు ఊపు తెచ్చారు. బ్రిటిష్ పాలకుల దుర్మార్గాలకు వ్యతిరేకంగా రంగారెడ్డి అనేక సభల్లో ఎంతో ఆవేశంగా మాట్లాడేవారు. ఆగ్రహావేశాలతో ఉండే ఆయన ప్రసంగాలు వినేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చేవారు. దీంతో ఆయన బ్రిటిష్ పాలకులకు సింహస్వప్నంగా మారారు. బ్రిటిష్ ప్రభుత్వం ఆగ్రహంతో రంగారెడ్డి సభలపై నిషేధం విధించింది. 1940లో జారీచేసిన ఉత్తర్వుల్లో 'జిల్లాలో రంగారెడ్డి ఎక్కడా ఎలాంటి ఉపన్యాసాలు ఇవ్వకూడదని, అసలు స్వగ్రామం దాటి బయటకు వెళ్లనే కూడదని' శాసించింది. అయినా రంగారెడ్డి ఆ ఆదేశాలను ఏమాత్రం లెక్కచేయలేదు. దీంతో 1940 జూన్ 13న బ్రిటిష్ ప్రభుత్వం ఆయన్ను అరెస్టు చేసి, నార్త్ ఆర్కాట్ జిల్లాలోని వెల్లూరు సెంట్రల్ జైలులో నిర్బంధించింది.

# దేశమాత సేవలో.. అనంతరామ అయ్యంగార్



దేశ స్వాతంత్ర్యపోరాటంలో డా. బెజవాడ గోపాలరెడ్డి వంటి అనేక మంది యోధులతోపాటు నిత్యం దైవభక్తితో వేదపారాయణం చేసే ఓ వేదపండితుడు కూడా ఉద్యమంలో పాల్గొని తన దేశభక్తిని చాటుకున్నారు. ఆయన పేరే.. చక్రవర్తుల అనంతరామ అయ్యంగార్.

ఆయన స్వస్థలం గోపాలరెడ్డి గారి ఊరే.. బుచ్చిరెడ్డిపాళెం. బుచ్చిలోని కోదండరామస్వామి దేవాలయంలో ఆయన వేదపారాయణం చేసేవారు. మహాత్మాగాంధీజీ ఇచ్చిన పిలుపుకు స్పందించి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారాయన. గోపాలరెడ్డి గారి నాయకత్వంలో ఉప్పు సత్యాగ్రహంలో చేరారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమాల్లో పాల్గొన్నందుకు ఆయన్ను 1932 మార్చి 21న అరెస్టు చేశారు. నెల్లూరు జైలులోను, వెల్లూరు, తిరుచిరాపల్లి జైళ్లలోను ఆయన శిక్షను అనుభవించారు. తనకున్న ఆస్తినంతా ఉద్యమాలకే ఖర్చుచేసి తన దేశభక్తిని నిరూపించుకున్న మహనీయులాయన.

# బారాషహీద్ దర్గా..దేదీప్యమానం



- 'రొట్టెలపండుగ'కు లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనం
- కళకళలాడిన 'స్వర్ణాల తీరం', కిటకిటలాడిన నెల్లూరు నగరం

**మతసామరస్యానికి ప్రతీకగా, కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా నెల్లూరులో నెలవై ఉన్న అత్యంత పవిత్రమైన..ఎంతో ప్రసిద్ధమైన.. మహిమాన్వితమైన బారాషహీద్ దర్గాలో విశిష్టమైన 'రొట్టెల పండుగ'కు లక్షలాదిమంది భక్తులు తరలిరావడంతో నెల్లూరు నగరం భక్తజనసంద్రంగా మారింది. దర్గా ప్రాంగణమంతా కిటకిటలాడింది. నగరమంతా ఎక్కడ చూసినా భక్తజన కోలాహలమే. కరోనా నేపథ్యంలో గత రెండేళ్ళుగా ఈ పండుగ జరగకపోవడంతో, ఇప్పుడు జరుగుతున్న పండుగకు మరింత పెద్దఎత్తున భక్తజనం కదలివచ్చారు. మంగళవారం నుంచి శనివారం దాకా 5 రోజుల పాటు జరిగే ఈ పండుగకు దేశవిదేశాల నుంచి కూడా భారీసంఖ్యలో భక్తులు వచ్చి దర్గాను సందర్శించుకుని, రొట్టెల పండుగలో ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా అధికారయంత్రాంగం మొత్తం పండుగ ఏర్పాట్లపైనే దృష్టి నిలిపింది. అధికారులు, స్థానిక నాయకులు అందరూ కలసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.**



అనేక సంవత్సరాల నుంచి నెల్లూరులో 'రొట్టెల పండుగ' ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంటూనే ఉంది. దేశంలోనే ఎంతో అరుదైన ఈ పండుగ నెల్లూరుకే సొంతం. స్వర్ణాల చెరువుగా ప్రఖ్యాతి చెందిన.. చరిత్రాత్మకమైన నెల్లూరు చెరువు వద్ద 'కోర్కెల రొట్టెలు' స్వీకరించి, ఎంతో మహిమగల ఈ దర్గాలో మొక్కులు తీర్చుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాక దేశవిదేశాల నుంచి కూడా భక్తులు భారీసంఖ్యలో కదలివస్తుండడం బారాషహీద్ దర్గా ప్రత్యేకతకు నిదర్శనం. ఈ సందర్భంగా దర్గా ప్రాంగణమంతా విద్యుద్దీపాల వెలుగుల్లో కళ్ళు మిరుమిట్లు గొలిపేలా దేదీప్యమానంగా ప్రకాశించింది. స్వర్ణాలతీరం (నెల్లూరు చెరువుగట్టు) భక్తజనుల కోలాహలంతో కళకళలాడింది.

## కోర్కెల రొట్టెలు

విద్యలో రాణించాలని, ఆరోగ్యం బాగుండాలని, సౌభాగ్యంతో విలసిల్లాలని, వివాహం కావాలని, సంతానం కలగాలని, ఉద్యోగం రావాలని, జబ్బులు పోవాలని.. ఇలా ఎన్నోరకాల కోర్కెలతో వచ్చే భక్తులు, అప్పటికే ఆయా కోర్కెలు తీరిన భక్తులు వదిలే రొట్టెలను ఎంతో భక్తిశ్రద్ధలతో స్వర్ణాల చెరువు ఘాట్‌ల వద్ద నీళ్లలోకి దిగి స్వీకరించడం ఈ రొట్టెల పండుగలో ముఖ్యమైన విశేషం.

## వైభవోపేతంగా గంధోత్సవం

మేళతాళాలతో, పకీర్ల గీతాలు.. బాణాసంచా వేడుకలతో బారాషహీద్ దర్గా గంధోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈనెల 10వ తేది బుధవారం రాత్రి 10 గంటలకు నగరంలోని కోటమిట్టలో ఉన్న అమీనియా మసీదు నుంచి గంధోత్సవం బయలుదేరింది. 12బిందెల్లో సుగంధద్రవ్యాలతో గంధాలను కలిపి ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కడప పెద్ద దర్గా పీఠాధిపతి మహమ్మద్ హుసేని చిష్టివుల్ ఖాద్రి ఆధ్వర్యంలో బారాషహీద్ దర్గాలో అత్యంత పవిత్రమైన అమరవీరుల సమాధులకు గంధలేపనం చేసి ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధాన్ని స్వర్ణాల చెరువులో కలపడంతో రొట్టెల పండుగ ప్రాధాన్యతను సంతరించుకుంది.

## కట్టుదిట్టమైన చర్యలు

ఈనెల 9 నుంచి 13వ తేది వరకు అయిదురోజులు జరిగే ఈ పండుగకు జిల్లా అధికారయంత్రాంగమంతా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. కలెక్టర్ చక్రధర్ బాబు, ఎస్పీ విజయారావు భక్తుల కోసం మౌలిక సదుపాయాలు, భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. పెద్దసంఖ్యలో పోలీసులను బందోబస్తులో నియమించారు.

రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర మేయర్ స్రవంతి, కార్పొరేషన్ అధికారులు, దర్గా కమిటీ వారు, ప్రజాప్రతినిధులు అందరూ ఈ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.






# కల్యాణ వైభవం...!




గడచిన తరం నాయకుడు, నెల్లూరు జిల్లా ప్రముఖుడు దివంగత మేనకూరు గోపాలకృష్ణా రెడ్డి మునిమనుమరాలు, (ఆయన కుమార్తె ఉషమ్మ - అత్తిపల్లి వెంకట్రామ్‌రెడ్డిల మనుమరాలు), సట్టి శ్రీరామ్‌రెడ్డి - ఆశల కుమార్తె **ప్రణతి - ఆకాష్** (హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీరెడ్డి భాస్కరరెడ్డి - ఉమల కుమారుడు)ల కళ్యాణం ఆగస్టు 10 వ తేదీ హైదరాబాదులో జరిగింది. దంపతులిద్దరివీ పేరు, పరపతి కలిగిన కుటుంబాలు కావడంతో పెద్ద సంఖ్యలో నగర ప్రముఖులు బంధుమిత్రులు ఈ పెళ్ళి వేడుకలో పాల్గొని ప్రణతి - ఆకాష్ లను దీవించారు. కొత్త దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# దేశ ప్రయోజనాలే అందరికీ పరమావధి కావాలి


(3వ పేజీ తరువాయి)

ఇందులో ఎంపీలు పోషించాల్సిన పాత్ర కీలకమని ఉపరాష్ట్రపతి అన్నారు. భారతదేశంలో యువశక్తి ప్రతిభాపాటవాలకు కొదవలేదని, వాటికి పదునుపెట్టి సరైన అవకాశాలు కల్పించి సద్వినియోగపరుచుకుంటే భారతదేశం అంతర్జాతీయ యవనికపై అద్భుతాలు సృష్టించగలదని ఉపరాష్ట్రపతి అన్నారు. ఈ దిశగా ఎంపీలు దృష్టిసారించాలన్నారు. భారతదేశం స్వాతంత్ర్యాన్ని సముపార్జించుకుని 75 ఏళ్లు పూర్తవుతున్నప్పటికీ.. ఇంకా లింగ వివక్ష, పేదరికం, నిరక్షరాస్యత ఉన్నాయని, వీటిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషిచేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా 'దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్' అన్న గురజాడ అప్పారావు గారి మాటలను ఉపరాష్ట్రపతి ఉటంకించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేసినప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరన్నారు. ప్రతి ఒక్కరూ ఇతరులపట్ల సహనంతో వ్యవహరించడం అవసరమన్నారు. ప్రభుత్వం, విపక్షాలు ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకోవాలన్నారు. ఈ అయిదేళ్లలో తనకు అన్నిరకాలుగా సహకరించిన ప్రధామంత్రి, కేంద్ర మంత్రులు, విపక్ష పార్టీ నేతలు, ఎంపీలు, డిప్యూటీ చైర్మన్, ప్యానెల్ ఆఫ్ ఛైర్మెన్స్‌కు ఉపరాష్ట్రపతి ధన్యవాదాలు తెలిపారు.

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డెప్యూటీ ఛైర్మెన్ హరివంశ్, రాజ్యసభలో అధికారపక్ష నేత పీయూష్ గోయల్, విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి తదితరులతో పాటు అనేకమంది కేంద్రమంత్రులు, పార్లమెంటు ఉభయ సభల సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు..

# 'సెల్‌కాన్' సంస్థ రూ.కోటి విరాళం



'సెల్‌కాన్' సంస్థ సిఎండి శ్రీ గురు దంపతులు ఆగస్టు 4వ తేది తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు కోటి రూపాయలను విరాళంగా సమర్పించి స్వామి వారిపై తమ కున్న భక్తిని చాటుకున్నారు. అందుకు సంబంధించిన చెక్కును తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో తిరుమల తిరుపతి దేవస్థానాల కార్యనిర్వహణాధికారి ఏ.వి ధర్మారెడ్డికి అందజేశారు.

## క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారులకు..

# ఎమ్మెల్యే ప్రసన్న సాయం



క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు వైద్యచికిత్సల కోసం ఆర్థికసాయం అందించి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. విడవలూరు మండలం రామచంద్రపురం పంచాయతీలో కృష్ణపట్నం గోవిందుకు 25 వేల రూపాయలు, వావిళ్ళ హర్షవర్ధన్‌కు 25 వేలు సాయంగా అందించారు.

అదేవిధంగా రామచంద్రపురం గ్రామంలో అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయిన కోడూరు భవానికి 10వేల రూపాయలు, పొండ్లపూడి గ్రామంలో భర్త చనిపోయిన తాతా కామాక్షి కుటుంబానికి చేయూతగా మరో 10వేలు, మొత్తం రూ.70 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఇటీవల బాధితులకు అందజేశారు. తమ తండ్రి, స్వర్గీయ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆ సాయాన్ని అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.



# శ్రీసిటీలో.. సాంకేతిక విద్యా కమిషనర్

- పరిశ్రమల ప్రతినిధులు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్స్‌తో సమావేశం
- డిప్లొమా కోర్సులు, పాఠ్యాంశాలపై చర్చ



అంతర్జాతీయ ఖ్యాతి గాంచిన పారిశ్రామికవాడ.. శ్రీసిటీలో రాష్ట్ర ఉన్నత విద్య మరియు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ అధ్యక్షతన ఈనెల 9న పలు పరిశ్రమల ప్రతినిధులు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్స్‌తో సమావేశం జరిగింది. శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల సీనియర్ మేనేజర్లు, సాంకేతిక విద్యా శాఖ ఉన్నతాధికారులు మరియు తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు, వాటి పాఠ్యాంశాల పునర్వ్యవస్థీకరణపై సుదీర్ఘంగా చర్చించారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా రాష్ట్రవ్యాప్తంగా డిప్లొమా కోర్సు పాఠ్యాంశాలలో తక్షణమే పెనుమార్పులు చేయాల్సిన అవసరం ఉందని పరిశ్రమ ప్రతినిధులు సాంకేతిక విద్యా కమిషనర్‌ను కోరారు. అందుకు స్పందించిన కమిషనర్, సిలబస్‌ను సంస్కరించాల్సిన అవసరాన్ని అంగీకరించారు.

## కాలం చెల్లిన సిలబస్‌ను సవరించాలి - శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి

పరిశ్రమవర్గాల అభిప్రాయాలతో సాంకేతిక కోర్సులను ఆధునీకరించేందుకు చొరవ తీసుకున్న కమిషనర్‌కు ఈ సందర్భంగా శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు చెప్తూ, ఈ రోజుల్లో సాంకేతిక విద్యా సిలబస్ చాలా చర్చనీయాంశంగా మారిందని, పరిశ్రమ మనుగడ ఎక్కువగా మెరుగైన, వినూత్నమైన కొత్త సాంకేతికతలపై ఆధారపడి ఉంటుందని, కనుక కాలం చెల్లిన సిలబస్‌ను సవరించాలని, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా మార్చాలని సూచించారు. సాంకేతిక విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి డాక్టర్ నారాయణరావు, సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులు, శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల సీనియర్ మేనేజర్లు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

# శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్‌కు.. ఎకరా స్థలం కేటాయింపు

శ్రీసిటీలో హైటెక్ పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీసిటీ యాజమాన్యం ఒక ఎకరం స్థలాన్ని కేటాయించి, ఆ శాఖకు బదిలీ చేసింది. ఆగస్టు 9న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉన్నత విద్య మరియు సాంకేతిక విద్యా కమిషనర్ పోలా భాస్కర్, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య, పలు పరిశ్రమల ప్రతినిధుల సమక్షంలో డిఎస్పీ జగదీష్‌నాయక్‌కి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆ భూమి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# కళ్యాణ వైభవం...!





రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ (జి. ఎస్. టీ ) అడిషనల్ కమిషనర్, నెల్లూరీయులకు చిరపరిచితులు, స్నేహశీలి, సౌమ్యుడు సలిపెల కృష్ణమోహన్‌రెడ్డి - శ్రీమతి నిర్మలల కుమార్తె **డాక్టర్ రచిత కృష్ణ - డాక్టర్ సందీప్ అనిరుధ్** (ప్రముఖ గుండెవ్యాధి నిపుణులు డాక్టర్ పల్చూరు మురళీశంకర్‌రెడ్డి - రజనిల కుమారుడు)ల వివాహం ఆగస్టు 4 న తాడేపల్లిలో, రిసెప్షన్ ఆగస్టు 7న నెల్లూరులో జరిగాయి. జిల్లాకు చెందిన పలువురు రాజకీయ, అధికార, అనధికార, పారిశ్రామిక, వ్యాపార, వైద్య ప్రముఖులు ఈ రెండు వేడుకలలో పాల్గొని రచిత -సందీప్‌లను దీవించారు. కొత్త దంపతులకు 'లాయర్' ఆశీస్సులు.




# కళ్యాణ వైభవం...!

**దినేష్ - శృతి**




రిటైర్డ్ జిల్లా జడ్జి నరసింహులు నాయుడు - పద్మావతిల మనుమడు, మాడుపూరు వెంకట రామమోహన్‌రావు - లక్ష్మిల కుమారుడు **దినేష్ - శృతి**ల వివాహం ఆగస్టు 4వ తేదీ రాజంపేటలోని తోట కన్వెన్షన్ సెంటర్ నందు ఘనంగా జరిగింది. ఈ వివాహానికి జిల్లా ప్రముఖులు పలువురు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

**రాశి - సూర్య**



నెల్లూరు వాస్తవ్యులు మెట్టు రామచంద్రప్రసాద్ - పరమేశ్వరమ్మల మనుమరాలు, లేట్ మెట్టు శివకుమార్ - రాధికల కుమార్తె **లక్ష్మీ సౌందర్య రాశి - సూర్య**ల పెళ్లి ఆగస్టు 8వ తేదీ నెల్లూరులోని కె.జి.కె కళ్యాణ మండపంలో వైభవంగా జరిగింది. నవ దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.

**కీర్తి - మహితేజ**



నెల్లూరు మాగుంట లే అవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు గోళ్ళమూడి శ్రీధర్‌రెడ్డి సోదరుడు గోళ్ళమూడి కృష్ణారెడ్డి - అనితల కుమార్తె **కీర్తి - మహితేజరెడ్డి**ల పరిణయం ఆగస్టు 7వ తేదీ నెల్లూరులోని పివిఆర్ కళ్యాణ మండపంలో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

**సంజయ్ - గౌరి**



నెల్లూరు వాస్తవ్యులు (రాధికా మెడికల్స్ భాగస్వామ్యులు) స్వర్గీయ పద్మనాభుని వెంకటశ్రీధర్ - దేవికల కుమారుడు **వెంకట సత్యసాయి సంజయ్‌మిత్ర - గౌరి సింధూజ**ల కళ్యాణం ఆగస్టు 4వ తేదీ నెల్లూరులోని డిఎస్ఆర్ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

## బీసీల అభ్యున్నతికి..

# మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయాలి

### - ఢిల్లీలో జరిగిన మహాధర్నాలో బీద



దేశంలో బీసీల (వెనుకబడిన వర్గాలు) అభ్యున్నతికి బీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటుచేయాలని, కేంద్రబడ్జెట్‌లో బీసీలకు లక్ష కోట్లు కేటాయించాలని రాజ్యసభ సభ్యులు, మన నెల్లూరీయులైన బీద మస్తాన్‌రావు డిమాండ్ చేశారు. నేషనల్ బిసి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఇటీవల పెద్దఎత్తున జరిగిన బీసీల మహాధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రాల్లో బీసీల పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని, చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ కోసం పార్లమెంటులో బిల్లు పెట్టాలని ఆయన కోరారు. ప్రైవేటు రంగంలోనూ బీసీలకు రిజర్వేషన్లు అమలుచేయాలన్నారు.

### సిఎం జగన్..దేశానికే ఆదర్శం

సామాజిక న్యాయం అమలుచేయడంలో సీఎం జగన్ దేశంలోనే ఒక రోల్‌మోడల్‌గా నిల్చారని బీద ఈ సందర్భంగా కొనియాడారు. మంత్రి పదవులు మొదలు, అన్ని నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారని, మంత్రివర్గంలో ఏకంగా 10 మంది బీసీలకు అవకాశం ఇచ్చారని తెలిపారు. నిజానికి తమది బీసీల పార్టీ అని చెప్పుకున్న వారు కూడా ఆ పని చేయలేదన్నారు. సిఎం జగన్ అధికారంలోకి వచ్చాక రాజ్యసభ టికెట్లు కూడా బీసీలకు ఎక్కువగా ఇవ్వడం జరిగిందని, మొత్తం 9 మంది రాజ్యసభ సభ్యులుంటే అందులో నలుగురు బీసీలు ఉండడం సంతోషకరమని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు 50శాతం పదవులు ఇస్తూ, ఏకంగా చట్టమే చేయడం జరిగిందని, మొత్తం కార్పొరేషన్లలో 109 పదవులు, అలా 76 శాతం పదవులు బీసీలకు ఇచ్చారని, అంతేకాకుండా అన్ని పథకాల్లోనూ బీసీలకు పూర్తి న్యాయం చేస్తున్నారని, ఓటు బ్యాంక్ రాజకీయాలు కాకుండా, నిరుపేదలు అభివృద్ధి చెందేలా సిఎం జగన్ కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు. ఈ ఆందోళనలో బీసీ నాయకులు శంకర్‌రావు తదితర నాయకులు పాల్గొన్నారు.

# విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పరిస్థితేమిటి?

### రాజ్యసభలో ప్రశ్నించిన బీద మస్తాన్‌రావు

విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్ట్ కోసం అవసరమైన భూమిని స్వాధీనం చేసుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి అప్పగించిందా? ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడానికి ప్రభుత్వం ఏదైనా కాలపరిమితిని నిర్ణయించిందా? వాటి వివరాలను తెలియచేయాలని ఈనెల 5న రాజ్యసభలో సభ్యుడు బీద మస్తాన్‌రావు కేంద్రాన్ని ప్రశ్నించారు. అందుకు కేంద్ర వాణిజ్యం, పరిశ్రమలశాఖ మంత్రి సోంప్రకాష్ సమాధానమిస్తూ విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కింద మూడు నోడ్‌లు విశాఖపట్నం, చిత్తూరు (శ్రీకాళహస్తి), కడప (కొప్పర్తి) అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంకల్పించిందని, ఆసియా అభివృద్ధి బ్యాంక్ నుండి ఆర్థిక సహాయంతో రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నం నోడ్ అభివృద్ధిని సొంతంగా చేపట్టిందని, ప్రాజెక్ట్ కోసం మాస్టర్ ప్లానింగ్ మరియు ప్రాథమిక ఇంజనీరింగ్‌తో సహా అభివృద్ధి కార్యకలాపాలకు సంబంధించి కేటాయించిన రూ. 3.13 కోట్లను చిత్తూరు (శ్రీకాళహస్తి), కడప (కొప్పర్తి) నోడ్‌ల కోసం వినియోగించుకున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టు కోసం భూమిని ఇవ్వాల్సివుందని, దానిని అప్పగించడం పూర్తయిన తర్వాత ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కాలపరిమితి నిర్ణయించగలమని వివరించారు.

# "ఫైర్ సేఫ్టీ" మార్గదర్శకాలపై శ్రీసిటీలో సమీక్ష



జిల్లా అగ్నిమాపక అధికారికి శ్రీసిటీ జ్ఞాపిక బహుకరణ

ఫైర్‌సేఫ్టీ నూతన మార్గదర్శకాలపై మంగళవారం సాయంత్రం శ్రీసిటీలో సమీక్ష సమావేశం నిర్వహించారు. నూతన మార్గదర్శకాలకు సంబంధించిన ముసాయిదా ప్రకటనను ఖరారు చేయడానికి నిపుణుల అభిప్రాయాలు, సూచనలు తెలియచేయాలని తిరుపతి జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్ వెంకటరమణ ఈ కార్యక్రమంలో శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల భద్రత మరియు మానవ వనరుల అధికారులను కోరారు.

శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, ఫైర్‌సేఫ్టీ నిబంధనలు, అనుమతులకు సంబంధించి సంస్కరణలు చేపడుతున్నందుకు రాష్ట్ర ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్‌గా.. పరవస్తు నాగసాయి సూరి



భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు మీడియా అధికారిగా బాధ్యతలు నిర్వహించిన పరవస్తు నాగసాయి సూరిని కేంద్రప్రభుత్వం ఇటీవల కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (కేంద్ర సమాచార విభాగం), నెల్లూరు క్షేత్ర కార్యాలయ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ (క్షేత్ర ప్రచార అధికారి)గా నియమించింది. మొన్నటిదాకా న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతి కార్యాలయ సమాచార విభాగంలో మీడియా అధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన..ఇక నుంచి నెల్లూరు, ప్రకాశం జిల్లాల క్షేత్ర ప్రచార అధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్, గ్రూప్-బి 2017బ్యాచ్‌కు చెందిన సూరి, గతంలో గుంటూరు-కృష్ణా జిల్లాల క్షేత్ర ప్రచార అధికారిగా కూడా బాధ్యతలు నిర్వహించారు.

# ఘనంగా స్నేహితుల దినోత్సవం

ఈనెల 7న స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కోవూరులోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర హాస్టల్‌లో నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి మోపూరు పెంచల నరసింహం వారి తండ్రి మోపూరు పెంచల నాయుడు ట్రస్ట్ పేరుతో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు పాడ్స్, పెన్స్ బహుమతులుగా అందజేశారు. సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటరావు, ఉపాధ్యాయులు రాజా, కవి అల్లాడి వేణుగోపాల్, డికెడబ్ల్యు కాలేజీ లెక్చరర్ సురేంద్ర తదితరులు పాల్గొని మాట్లాడుతూ మంచి స్నేహం కంటే మించినది లేదంటూ స్నేహం ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజెప్పారు. ప్రముఖ కవయిత్రి సుభద్రాదేవి మాట్లాడుతూ జీవితంలో మనిషి కుటుంబాన్ని, సమాజాన్ని, పర్యావరణాన్ని, చెట్టుని, మిగిలిన ప్రాణులతో కూడా స్నేహంగా మెలిగినప్పుడే మానవ మనుగడ సుఖప్రదం అవుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్, స్వీట్స్ పంచిపెట్టారు.

## ఎగరాలి మువ్వన్నెల జెండా!

ఎగరాలి ఎగరాలి
మన భారత జెండా
అదే మనకు ఎంతో అండ
ఆ రెపరెపలే మనకు కనిపించేనుగా
త్యాగధనుల గాధలు మనకు వినిపించేనుగా!

స్వాతంత్ర సమర వీరుల ఊపిరిగా
ప్రపంచపు ఎత్తులపై మన జెండా ఎగరాలి.
జెండా కాదు.. అది లక్షల మంది ప్రాణ త్యాగం,
జెండా కాదు.. అది భారతీయ ఆత్మగౌరవం.

ఎగరెయ్యి ఎగరెయ్యి ఓ భారతీయుడా!
ప్రతి ఇంటిపై మువ్వన్నెలు ఎగిరేలా,
ప్రతిఒక్కరి మనసులో దేశభక్తి విరిసేలా!
ప్రతి వీరుని త్యాగం గుండె గుండెను తడమాలి.
వందేమాతరం అని ప్రతి ఇల్లు ప్రతిధ్వనించాలి.
జండా ఎగరేసి మన కీర్తి
దశదిశలా చాటాలి.

ఎగరెయ్యి ఎగరెయ్యి ఓ భారతీయుడా!
మువ్వన్నెలు మురిసేలా
హరివిల్లు విరిసేలా
భరతమాతకు ఆనందం కలిగేలా
ఎగరెయ్యి ఎగరెయ్యి త్రివర్ణ పతాక.

**వై.స్పందన, 9వ తరగతి.**
**డా. బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకులం.**
**పుదూరు, నాయుడుపేట మండలం.**

# 'ఇంటింటా జాతీయజెండా'ను విజయవంతం చేయాలి

**- జడ్పీ సిఇఓ వాణి**




అజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా ఈనెల 8న నెల్లూరులో ఏపి మైనార్టీ గురుకుల పాఠశాల నుంచి అయ్యప్పగుడి దాకా విద్యార్థులతో భారీ ర్యాలీ జరిగింది. జడ్పీ సిఇఓ వాణి పాఠశాలలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రతి ఒక్కరూ దేశంపై భక్తి, గౌరవం కలిగి ఉండాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు ఈనెల 13 నుంచి 15వతేదీ వరకు జాతీయ జెండాని ప్రతి ఇంటిపై రెపరెపలాడించాలని ఆమె విద్యార్థులకు సూచించారు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ కీర్తి పతాకం రెపరెపలాడేలా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని ప్రజలంతా విజయవంతం చేయాలని కోరారు. మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కనకదుర్గ భవాని మాట్లాడుతూ ఎందరో దేశభక్తులు ఎన్నో త్యాగాలు చేసి మనకు స్వాతంత్ర్యాన్ని ప్రసాదించారని, స్వాతంత్ర్యం సిద్ధించి 75 వసంతాలు పూర్తి చేసుకున్న శుభవేళ ఆ మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యతగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు అందరిని ఆకట్టుకున్నాయి. సమగ్ర శిక్ష ఏపీసి ఉషారాణి, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, సోషల్ వెల్ఫేర్ డెప్యూటి డైరెక్టర్ రమాదేవి, సెట్నల్ సిఇఓ పుల్లయ్య, జిల్లా యూత్ఆఫీసర్ మహేంద్రరెడ్డి, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమామహేశ్వరి, ఎంఈఓ అనిల్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కామేశ్వరి, హెచ్ఎంలు ఖాజారహంతుల్లా, సుశీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో.. గుడ్డసంచులు పంపిణీ



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 9న ఉచితంగా గుడ్డసంచులు పంపిణీ చేశారు. స్థానిక ఏసి స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొండూరు సుబ్బారావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకం బదులు గుడ్డసంచులు వాడుకోవడం మంచిదన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ కోశాధికారి నలుబోలు బలరామయ్యనాయుడు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రజలు చైతన్యవంతులై సమాయత్తం కావాలన్నారు. సుమారు 20వేల రూపాయల ఖర్చుతో గుడ్డసంచులు తెచ్చి వాకర్స్ అసోసియేషన్ వారు ఈ కార్యక్రమం నిర్వహించారు. వాకర్స్ ప్రతినిధులు దాసరాజు సత్యనారాయణ, రావూరి సుబ్బారావు, జాలీవాకర్ నజీర్అహ్మద్, వాకర్స్ మాజీ గవర్నర్ వై.రాఘవరెడ్డి, పాముల శ్రీనివాసులు, డాక్టర్ సత్యనారాయణ, పులగల సబ్బారావు, మహ్మద్‌రఫీ, సాయి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### సంగం బ్యారేజీ నిర్మాణపు పనుల్లో...

# ప్రమాదవశాత్తూ కార్మికుని దుర్మరణం

సంగం బ్యారేజీ నిర్మాణపు పనుల్లో ఉన్న ఓ కార్మికుడు ప్రమాదవశాత్తూ దుర్మరణం పాలయ్యాడు. బ్యారేజీ 12వ గేట్ వద్ద రబ్బరు సీలు బిగించిన తర్వాత హటాత్తుగా ఇనుపరోప్ తెగిపోవడంతో 15 టన్నుల బరువైన ఆ గేటు కిందపడి ఎం.జయలాల్ అనే కార్మికుడు మృతి



చెందాడు. అప్పటికప్పుడు కార్మికులు ఆ గేటును ఎత్తి జయలాల్‌ను సంగం ప్రాథమిక ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆ కార్మికుడు కన్నుమూశాడు. ఆయన సోదరుడు దినేష్ కూడా ఇక్కడే పని చేస్తున్నాడు. సోదరుడు మృతిచెందడంతో ఆయన స్పృహ కోల్పోయారు. మృతుడు జయలాల్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని తెలుస్తోంది. బీహార్ నుంచి వచ్చి ఇక్కడ బ్యారేజీ నిర్మాణపు పనులు చేస్తున్న జయలాల్ మరణించడంతో బీహార్‌లో ఉన్న వారి కుటుంబసభ్యులకు పోలీసులు సమాచారం అందించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గ్రేట్ రిజైమ్

పేరాశల్ని ప్రేమించాక
మితిమీరిన రాబడి రుచిచూశాక
ప్రజల్ని గురించి ఆలోచించే కాలమానం
ఎలా పనిచేస్తుంది?
వడిసెలరాయితో ఎడాపెడా బాదితే
నొప్పి తగిలిందని చెప్పని మూగ జీవులున్నా
దేశంలో మాకై మేమే మేల్కోవాలా
ఆహారం కోసం అలమటిస్తేనేం
ది గ్రేట్ జిఎస్‌టి రిజైమ్‌లో తిరుగాడే
అవకాశం ఇస్తున్నాంగా!
పారాహుషార్
అన్నాలు తినడం మానేస్తేనేం
పండ్లు పచ్చికూరలు తిని ఆరోగ్యంగా
జీవించమంటున్నాంగా
ఇది ప్రజా సంక్షేమానికి పర్యాయపదం
కాదా మిత్రమా!
గేదె పాలకు మేమేమీ అడ్డు చెప్పలేదు కదా
పెరుగు మజ్జిగలు మీకు అజీర్తిచేస్తాయని
అడ్డుపెట్టాం గాని
'పాల'బడి శ్రేష్టతను మేమెప్పుడైనా
విస్మరించామా నేస్తమా!
మిమ్మల్నేదైనా నడ్డి విరిచే నిర్ణయాల్ని
'నిర్మల'ంగా మర్చిపోండి
ఇంధనాలు ఆకాశమార్గాన
పయనిస్తున్నాయని
ఎందుకు చింత మీకు
యోగాతో బాటు యోజనాల దూరం
నడకను ప్రాక్టీసు చేయండి
మీ సామర్థ్యంపై శ్రద్ధ వహించండి
ఆరోగ్య భారత్‌ను సాధిద్దాంరండి
అనవసరమైన ఆందోళనలను
మానండి!



**- చిన్ని నారాయణరావు**
**9440202942**

## టూకీగా...



### ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల పేరుతో పిండేస్తున్నారు

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధికఫీజులతో ప్రజలను పిండేస్తున్నారని, నిబంధనలు అతిక్రమిస్తూ ఇష్టారాజ్యంగా ఉంటున్నారని, ఆ పాఠశాలలకు ఆటస్థలం కానీ, లైబ్రరీ గానీ లేకపోయినా ఫీజులు మాత్రం వేలకువేలు గుంజేస్తున్నారని, వారి దోపిడీని అరికట్టాలని కోరుతూ బుచ్చిరెడ్డిపాళెంలో వైకాపా విద్యార్థి సంఘం నాయకుడు కోవూరు మహేష్ తదితరులు బుచ్చి ఎంఇఓకు వినతిపత్రం సమర్పించారు.

### కందుకూరులో 14న.. మునిసిపల్ వర్కర్స్ జిల్లా మహాసభలు

ఏపి మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధ సంస్థ) నెల్లూరుజిల్లా శాఖ ద్వితీయ మహాసభలు ఆగస్టు 14న కందుకూరులో జరుగుతాయని, జిల్లాలోని మునిసిపల్ వర్కర్స్ అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లె అంకయ్య కావలి జర్నలిస్టు క్లబ్‌లో ఇటీవల జరిగిన విలేకర్ల సమావేశంలో కోరారు.

### కోవూరు చెరువు కలుజుపై వంతెన కట్టాలి

కోవూరు చెరువు కలుజుపై వంతెన లేకపోవడంతో రాకపోకలకు వాహనాల వారు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే ఆ వంతెన నిర్మించి సమస్యలు తీర్చాలని సిపిఎం నాయకులు గండవరపు శేషయ్య, ఎం.సుబ్బారావు, ఖాదర్ బాషా, బుజ్జయ్య, సురేష్, సర్దార్ అహ్మద్, కాలేషా, శ్రీనివాసులు కోవూరు తహశీల్దారు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

### పొదలకూరు శ్మశానాన్ని బాగుచేయండి బాబూ!

పొదలకూరులోని హిందూ శ్మశానవాటిక ఏళ్ళతరబడిగా ఎలాంటి దారిడొంకా లేక ముళ్ళచెట్లతో నిండివుందని, ఇకనైనా అధికారులు దాన్ని బాగుచేసి దారి ఏర్పాటుచేయాలని, శ్మశానం చుట్టూతా ప్రహరీ నిర్మించాలని ఇటీవల ఆ శ్మశానాన్ని సందర్శించిన సామాజిక కార్యకర్తలు పిపిఎన్ ప్రసాద్, హరిబాబు యాదవ్, రమేష్, ప్రసాద్, సతీష్ తదితరులు కోరుతున్నారు.

### రైతు సమస్యలపై.. 6 నుండి జీపుయాత్రలు

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 16 నుంచి జిల్లాలోని సీతారామపురం నుంచి, మరోవైపు కందుకూరు, మనుబోలు ప్రాంతాల నుంచి జీపుయాత్రలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం నాయకులు కాకు వెంకటయ్య, నాగేశ్వరరావు, రత్తయ్య, మస్తానరెడ్డి తెలియజేశారు. పెద్దసంఖ్యలో రైతులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

### సచివాలయ ఉద్యోగులకు మెమోలు

విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్నారంటూ ఉదయగిరి మండలం కొండాయపాళెం గ్రామ సచివాలయంలోని ఇద్దరు సచివాలయ ఉద్యోగులకు ఉదయగిరి ఎంపిడిఓ ప్రవీణ్ మెమోలిచ్చారు. ఆ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, హాజరుపట్టికలో సంతకాలు చేయకుండా విధులకు గైర్హాజరవుతున్నారంటూ వారిపై ఆయన మండిపడ్డారు.

### ఉలవపాడులో జ్వరాల జోరు

ఉలవపాడు మండలంలోని అనేక గ్రామాల్లో వైరల్ జ్వరాలు పెరిగిపోతున్నాయి. టైఫాయిడ్, మలేరియా జ్వరాలతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో ఉలవపాడు ప్రభుత్వాసుపత్రి జ్వరాల బారినపడ్డ బాధితులతో నిండిపోతోంది. రోజుకు 50 దాకా జ్వరాల కేసులు వస్తున్నాయి.

### కోవూరులో గాంధీమహాత్మునికి పాలాభిషేకం

అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈనెల 9న కోవూరు గాంధీపార్కు సెంటర్ వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి మండల బిజెపి నాయకులు పాలాభిషేకం చేసి, ఆ మహాత్ముని సేవలను స్మరించుకున్నారు. మండల బిజెపి అధ్యక్షుడు రఘురామయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు విజయలక్ష్మి, పెంచలరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ వైభవం...!

## సాయితేజ - సునయన



కలువాయి మండలం, తోపుగుంట గ్రామస్తులు, ప్రస్తుతం హైదరాబాదు స్థిర నివాసి, సుదీర్ఘకాలం 'ఈనాడు' దినపత్రికలో అడ్వర్‌టైజ్‌మెంట్ విభాగంలో పనిచేసి పదవీ విరమణ చేసిన మోడిబోయిన శివశంకరయ్య - రాజేశ్వరిల కుమారుడు **సాయితేజ - సునయన**ల పెళ్లి ఆగస్టు 4వ తేదీ నెల్లూరులోని అచ్యుత సుబ్రహ్మణ్యం కళ్యాణ మండపంలో వైభవంగా జరిగింది. నవ దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.

## అభిజ్ఞ - కిషోర్



ప్రముఖ ఇంద్రజాలికుడు గుంజి రాంజీ - శ్రీదేవిల కుమార్తె **అభిజ్ఞ - కిషోర్**ల వివాహం ఆగస్టు 7వ తేదీ నెల్లూరులోని ఏనుగు సుందరరామిరెడ్డి కళ్యాణ మండపం నందు ఘనంగా జరిగింది. ఈ వివాహానికి సినీ హీరో సుమన్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## వరుణ్-అఖిల



రైల్వే శాఖలో ఉన్నతస్థాయి ఉద్యోగిగా పనిచేస్తున్న మానికల ఏడుకొండలు - లక్ష్మిల కుమారుడు **తేజ వరుణ్ - అఖిల**ల కల్యాణం ఆగస్టు 3వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

## లావణ్య - పవన్



నెల్లూరు వాస్తవ్యులు చెంగల్‌పట్టు శ్రీధర్ - ప్రసన్నల కుమార్తె **లావణ్య - పవన్‌కుమార్‌రెడ్డి**ల పరిణయం జులై 30వ తేదీ రాత్రి నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో వైభవంగా జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.




# ఎన్‌బికెఆర్ విద్యార్థులు.. ఎన్‌సిసి క్యాడెట్ల ర్యాలీ

అజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈనెల 9న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని పురస్కరించుకుని కళాశాల డైరెక్టర్ డా.వి.విజయ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌సిసి క్యాడెట్లు, విద్యార్థులు జాతీయజెండాలతో విద్యానగర్‌లో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. 20 అడుగుల జాతీయజెండాను ఎగురవేసి అందరూ దేశభక్తి నినాదాలు చేశారు. స్వాతంత్ర్యదిన అమృతోత్సవాల సందర్భంగా ప్రతిఒక్కరూ దేశభక్తితో మెలగాలని, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ర్యాలీని ప్రారంభించిన డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి విద్యార్థులకు చెప్పారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం, క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎన్‌సిసి ఆర్మీ అధికారి లెఫ్టినెంట్ మాధవయ్య, నావల్ విభాగాధికారి డా.మల్లికార్జునరెడ్డి, శోభారాణి, ఎన్‌సిసి అధికారి డా.ఉదయ్‌కుమార్‌రాజు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# ఆ ఎంపీని బర్తరఫ్ చేయాలి



హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ చేసిన అసభ్య ప్రవర్తనను నిరసిస్తూ గూడూరు పట్టణంలో సోమవారం టిడిపి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. స్థానిక పార్టీ కార్యాలయం నుండి గడియారపు స్తంభం వరకు మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, నాయకులు తదితరులు ర్యాలీ చేపట్టారు. ఎం.పికి వ్యతిరేకంగా నినాదాలు చేసి దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ గోరంట్ల మాధవ్‌పై గతంలో కేసులున్నాయని తెలిసి కూడా ఎం.పి టికెట్ ఇచ్చారంటే, ఆ పార్టీ విలువలు ఎలాంటివో అర్ధమవు తోందన్నారు. ప్రజాప్రతినిధిగా ఉండి సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించిన గోరంట్ల మాధవ్‌ను బర్తరఫ్ చేసి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిల్లు చెంచురామయ్య, లీలావతి, శ్రావణి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఇజ్రాయిల్ కుమార్, భారతి తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ మహాసభలను జయప్రదం చేయండి



ఈనెల 14, 15 తేదీలలో తిరుపతిలో నిర్వహించనున్న సిపిఐ జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఆ జిల్లా ఏఐటియుసి టాక్సీ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.పి. బాల పిలుపునిచ్చారు. ఆదివారం గూడూరు పట్టణంలోని రైల్వేస్టేషన్ టాక్సీ యూనియన్, పోస్టల్ కార్యాలయ టాక్సీ యూనియన్ నాయకులతో సమావేశమయ్యారు. తిరుపతి జిల్లా సిపిఐ ప్రథమ మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 14, 15 తేదీలలో తిరుపతి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ప్రథమ జిల్లా మహాసభలను కార్మికులు, కర్షకులు, పార్టీ శ్రేణులు, ఆటో, టాక్సీ, టెంపో కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి టాక్సీ యూనియన్ జిల్లా కోశాధికారి ఎల్.కె.నాయుడు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్.పూర్ణ, ఏఐటియుసి కార్యదర్శి పి.చంద్రయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా, ఎగ్జిక్యూటివ్ మెంబర్ సివిఆర్ కుమార్, యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపి, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల గూడూరు పట్టణంలోని డిఎన్‌ఆర్ కమ్యూనిటీ హాలులో నగదు పురస్కారాలను ఆంధ్ర మహిళామండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి చేతులమీదుగా అందజేశారు. వెంకట సుధీర్‌రెడ్డి, డి.ప్రజేంద్రరెడ్డి, సుబ్బారెడ్డి, సిద్ధారెడ్డి, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తల్లిని హతమార్చిన కొడుకు

గూడూరు పట్టణంలోని ఎగువ వీరారెడ్డి పల్లి పరిధిలో ఈ నెల 6న నావూరు జ్ఞానమ్మ(60)ను ఆమె కన్న కొడుకు నావూరు నరసింహులు అత్యంత దారుణంగా హత్య చేసినట్లు డిఎస్పీ రాజగోపాలరెడ్డి తెలిపారు. 1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సి.ఐ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పవన్‌కుమార్, ఎస్సై ఝాన్సి, సిబ్బంది చిరంజీవి, వెంకటేశ్వర్లురాజు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. హంతకుడు నావూరు నరసింహులును అరెస్టు చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు.

# రొట్టెల పండుగలో.. రెడ్‌క్రాస్ సేవలు




నెల్లూరు నగరంలోని ప్రసిద్ధ బారాషహీద్ దర్గాలో పెద్దఎత్తున జరిగిన రొట్టెల పండుగకు పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులకు నెల్లూరుజిల్లా రెడ్‌క్రాస్ శాఖవారు తమవంతు సేవలందించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 100 మంది వాలంటీర్లతో దర్గా ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరంతో పాటు అంబులెన్స్ సేవలు, అత్యవసర పరిస్థితిలో అవసరమైన సేవలు నిర్వహించారు. నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి, రెడ్‌క్రాస్ కోశాధికారి సురేషకుమార్ జైన్ ఈ శిబిరాలను ప్రారంభించారు. ఎ.ఆర్ డిఎస్పీ వైద్య శిబిరాన్ని సందర్శించి రెడ్‌క్రాస్ సేవలను అభినందించారు. రొట్టెల పండుగ సందర్భంగా దేశం నలుమూలల నుండి వేలాదిగా విచ్చేసిన భక్తులకు ఎలాంటి అనారోగ్యం కలుగకుండా ముందుజాగ్రత్తలు తీసుకున్నారు. అవసరమైన వారికి ప్రథమ చికిత్స అందిస్తూ, ఉచితంగా మందులు అందజేశారు. వందమంది వలంటీర్లు దర్గా దగ్గరున్న నెల్లూరు చెరువు ఘాట్ల వద్ద రొట్టెల పండుగలో పాల్గొన్న భక్తులకు అత్యవసర సేవలు అందించారు. రెడ్‌క్రాస్ జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు డి.రాజేంద్రప్రసాద్, వై.సురేష్, కన్వీనర్లు డా. టి.శ్రీరంజని, టి.భాస్కర్‌రెడ్డి, సిహెచ్ అజయ్‌బాబు, మురళీకృష్ణ, డా.ఉదయశంకర్, పీ.ఎం.పీ, ఆర్.యం.పి నాయకులు ఎ.వి.రమణయ్య, శాఖవరపు వేణుగోపాల్, కె.రవీంద్ర బాబు, రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ జి.వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అమృతోత్సవాలు..ఎంతో ఆనందకరం

## - ప్రముఖ స్వాతంత్ర్యయోధులు కెవి చలమయ్య



దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 వసంతాలు పూర్తవుతున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా భారతప్రభుత్వం అమృతోత్సవాలు నిర్వహిస్తుండడం గర్వకారణమని, ప్రత్యేకించి మన జిల్లా అంతటా ఈ ఉత్సవాలు ఘనంగా జరుగుతుండడం ఎంతో సంతోషకరమని నెల్లూరులోని ప్రముఖ స్వాతంత్ర్యసమరయోధులు, అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు సహచరులు కెవి చలమయ్య అన్నారు. 'అజాదీ కా అమృత్ మహోత్సవాలను' తాను చూడగలగడం తన అదృష్టమని ఆయన ఆనందించారు.

చిన్నతనంలోనే తన తల్లిదండ్రులు మరణించడంతో తాను నెల్లూరులోని తమ మేనమామ దేవతా చెంచురాఘవయ్య వద్ద పెరిగానని, ఆ రోజుల్లో శ్రీ పొట్టి శ్రీరాములు కూడా చెంచురాఘవయ్య ఇంటనే ఉండేవారని, ఆ మహనీయునితో కలసి తాను కూడా అనేక సమాజసేవా కార్యక్రమాల్లో పాల్గొనే భాగ్యం తనకు కలిగిందని చలమయ్య తెలిపారు. స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా విదేశీ బహిష్కరణ తదితర ఉద్యమాలతో పాటు, హరిజన దేవాలయ ప్రవేశం, మద్యపాన నిషేధం వంటి సామాజిక సేవా కార్యక్రమాలను శ్రీ పొట్టి శ్రీరాములు ముమ్మరంగా నిర్వహించారని, వాటిలో తాను కూడా పాల్గొన్నానని, నెల్లూరు తిప్పరాజువారి సత్రం వద్ద జరిగిన ఉద్యమంలో బ్రిటిష్ పోలీసులచే లాఠీదెబ్బలు తిన్నానని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. స్వాతంత్ర్యోద్యమం అనంతరం శ్రీ పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ఉద్యమిస్తున్న రోజుల్లో 1945 నుంచి 1952 దాకా ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో పాల్గొన్నానని, ఆ మహనీయుడు తమ ఇంటిలోనే ఉండడం వల్ల ఎప్పుడూ ఆయనతో పాటుగా తాను ఉంటూ వారి సాహచర్యంతో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించగలిగానని తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానంతో ఆంధ్రరాష్ట్రం అవతరించిందని, ఆ తర్వాత ఇటీవలి కాలంలో నెల్లూరుజిల్లాకు 'శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా'గా నామకరణం చేయాలని తాను చేసిన కృషి ఫలించి రాష్ట్ర ప్రభుత్వం 2008 జూన్ 4న ఆ మేరకు ఉత్తర్వులు ఇచ్చిందని ఆయన పేర్కొన్నారు. జిల్లా నామకరణోత్సవంలో తనకు నాటి ఆర్థికమంత్రి కె.రోశయ్య, అప్పటి కలెక్టర్ కె.రాంగోపాల్ చేతుల మీదుగా 'శ్రీ పొట్టి శ్రీరాములు అవార్డు' బహుకరించారని చలమయ్య చెప్పారు. రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా ఉన్నప్పుడు కె.రోశయ్య పలుసార్లు నెల్లూరులోని తన నివాసానికి ఆత్మీయంగా వచ్చిన సందర్భాలను కూడా ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ఆత్మబలిదానం చేసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములుకు 'భారతరత్న' ఇవ్వాలని, ఆ మహనీయుని కాంశ్య విగ్రహాన్ని అసెంబ్లీ, పార్లమెంట్ ఆవరణల్లోను, ఆయన చిత్రపటాలను అసెంబ్లీ, పార్లమెంట్ భవనాల్లోనూ పెట్టాలన్నదే తన ఆకాంక్ష అని, ఆమేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మరోసారి విజ్ఞప్తి చేస్తున్నానని ఆయన కోరారు.

# ఉభయ తారకం - మోడీ, బాబు కలయిక!

'అజాదీ కా అమృత్ మహోత్సవ్' పేరిట ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోడీ ఓ భారీ సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి దేశంలోని ముఖ్యమంత్రులు, గవర్నర్లు, కేంద్రమంత్రులు, వివిధ పార్టీలకు చెందిన ముఖ్యనేతలు మొదలైనవారిని ఆహ్వానించారు. ఆ సమావేశంలో పాల్గొనాల్సిందిగా తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడుకు కూడా ఆహ్వానం అందింది. ఈ వార్త రాష్ట్ర రాజకీయవర్గాలను ఒకింత ఆశ్చర్యానికి గురి చేసింది. ఓ పక్కన వైసీపీ అంట కాగుతున్నప్పటికీ కేంద్ర బీజేపీ నుంచి చంద్రబాబుకు ఇంత తొందరగా పిలుపు వస్తుందని అనుకోకపోవడమే ఇందుకు కారణం.


నిజానికి, భీమవరంలో జరిగిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ప్రధాని ఆవిష్కరించిన సభలోనే చంద్రబాబు పాల్గొనవలసి ఉంది. కొన్ని 'అనివార్య' కారణాల వల్ల అప్పుడు కుదరలేదు. దానిని దృష్టిలో పెట్టుకుని కూడా ఇప్పుడు చంద్రబాబుకు ఆహ్వానం పలికి ఉండి ఉండవచ్చు. ఈ ఆహ్వానం వచ్చిన తీరుకు తెలుగుదేశం వర్గాలు అమితానందం పొంది ఉంటాయనే చెప్పాలి.

2018లో బీజేపీ నుంచి టీడీపీ దూరంగా జరిగిన తరువాత, మోడీ – చంద్రబాబు ముఖాముఖి ఇప్పటి వరకూ కలుసుకోలేదు. బీజేపీతో వైరం పెట్టుకున్న దాని ఫలితం, చంద్రబాబుకు 2019లో కనిపించింది. ఆ ఫలితాలు చూసి దేశం వర్గాలు నిలువునా నీరైపోయాయి. ఎవరికీ నోట మాట రాలేదు. బీజేపీ పట్ల టీడీపీ నేతలు ఇక అప్పటి నుంచి పూర్తి మౌనం పాటించారు. చంద్రబాబు కూడా బీజేపీని పల్లెత్తు మాట అనకుండా వైసీపీ ప్రభుత్వ వ్యవహారశైలిపైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎం.పీ జీవీఎల్ నరసింహారావు వంటివారు వైసీపీని విమర్శించక తప్పని పరిస్థితి ఎదురైనప్పుడల్లా, చంద్రబాబును కూడా కలిపి విమర్శిస్తూ వచ్చారు. ఆయనను వెటకారాలాడారు. ఎగతాళి చేశారు. వారి స్థాయిని మించి త్రుళ్లిపడ్డారు. అయినా, చంద్రబాబు ప్రతివిమర్శ చేయలేదు. ఏ టీడీపీ నాయకుడూ బీజేపీపై పొరపాటున కూడా నోరు చేసుకోలేదు.

రాజకీయంగా ఇంత నిగ్రహం పాటించడానికి, ఎంతో ఓర్పు, హుందాతనం, దార్శనికత, రాజకీయ పరిణతి, లోతైన అనుభవం అవసరం.

మొన్న వచ్చిన రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా చంద్రబాబు గొప్ప పరిణతి ప్రదర్శించారు.




కేంద్రంలోని ఎన్‌డీఏ అడగకముందే, ఎన్‌డీఏ అభ్యర్థి శ్రీమతి ద్రౌపది ముర్మ్ము అభ్యర్థిత్వానికి టీడీపీ మద్దతును ప్రకటించారు. ఆమె అమరావతి పర్యటనలో వైసీపీ ప్రజాప్రతినిధులను కలుసుకోవడమే షెడ్యూల్‌లో ఉంది. అయితే తాము ఆమెతో సమావేశం విడిగా నిర్వహించి మద్దతు ప్రకటిస్తామని చంద్రబాబునాయుడు ప్రతిపాదించినప్పుడు, వైసీపీ ఆ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించినట్టు వార్తలు వచ్చాయి. కానీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఇందుకు ఏమాత్రం అంగీకరించకుండా, టీడీపీ సభకు శ్రీమతి ముర్మ్మను తీసుకెళ్లాలని ఆమెతో పర్యటిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఆదేశించినట్టు మీడియాలో వార్తలు విస్తృతంగా వచ్చాయి. దీంతో, శ్రీమతి ముర్మ్ము గేట్‌వే హోటల్‌లో టీడీపీ సభ్యుల సమావేశానికి వెళ్లారు. ఈ సమావేశంలో చంద్రబాబు 'దార్శనికత'ను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆమెకు ఎంతో ప్రత్యేకంగా వివరించి చెప్పారు.

ఈ సమావేశాన్ని టీడీపీ... బీజేపీ సత్సంబంధాల పునఃప్రారంభంగా కొందరు విశ్లేషకులు అప్పుడే అభిప్రాయపడ్డారు.

అయినా, చంద్రబాబు బీజేపీతో పునః కలయికకు తొందర పడుతున్నట్టు ఎక్కడా కనపడలేదు. ఉప రాష్ట్రపతి ఎన్నిక విషయంలో కూడా ఆయన ఎన్‌డీఏ అభర్థికే మద్దతు ప్రకటించారు. ఆయన, తన 'టైమ్' కోసం వెయిట్ చేస్తున్నారని అనిపించింది.

ఈలోగా రాష్ట్ర బీజేపీలో స్వరాల మార్పు మొదలైంది. చంద్రబాబు 'దార్శనికుడు' అని సోము వీర్రాజు అంటే, చంద్రబాబు 'గౌరవించదగిన' నాయకుడు అని విష్ణువర్ధనరెడ్డి అనే నాయకుడు అన్నారు. రాజధానిగా అమరావతిపై ఎప్పుడూ స్పష్టమైన స్టాండ్ తీసుకోని రాష్ట్ర బీజేపీ, ఇప్పుడు వారం రోజుల పాటు 'మనం – మన అమరావతి' పేరిట అన్ని గ్రామాల్లో పాదయాత్ర చేసింది.

ఈలోగా అజాదీ కా అమృత్ మహోత్సవ్ సమావేశం రానే వచ్చింది. దీనికి, దేశంలోని అనేకమంది రాజకీయ ప్రముఖులతో పాటు, చంద్రబాబునాయుడుకు కూడా ఆహ్వానం అందింది. దీంతో రాష్ట్ర రాజకీయవర్గాలు ఒక్కసారిగా షాక్‌కు గురైనట్టు కనపడింది, ఈ విషయంలో వ్యక్తమైన వ్యాఖ్యానాలు చూస్తే...

కేంద్రం ఆహ్వానంపై ఢిల్లీ వెళ్లిన బాబు టీడీపీ నేతలతో కలిసి, అభినందనలు చెప్పడానికని నూతన రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్మ్మను కలిశారు. ఆ సమావేశంలో ఆమె ఎంతో ప్లెజెంట్‌గా, ఆత్మీయంగా కనిపించారు.



మోడీ – చంద్రబాబు పునఃకలయికకు గట్టి పునాదే పడింది. ఆరోజు సాయంత్రం జరిగిన అజాదీ కా అమృత్ మహోత్సవ్ సమావేశం అయిపోతూనే, ప్రధాని మోడీ, చంద్రబాబు వద్దకు వచ్చి, ఆయనను ఓ పక్కకు తీసుకెళ్లారు. తరువాత చంద్రబాబుతో ఓ అయిదు నిముషాలు మాట్లాడారు. అయితే ఏం మాట్టాడారో తెలియదు. ఎవరికి తోచినట్టు వారు రాశారు, ఎవరికి నచ్చినట్టు వారు ప్రసారం చేశారు.

మొత్తంమీద నాలుగు సంవత్సరాల తరువాత మోడీ, చంద్రబాబుతో మాట్లాడారు. అదీ పాయింట్.

ఈ '5 నిముషాల' సమావేశం రాష్ట్రంలో కొత్త ఆలోచనలకు దారితీసింది. టీడీపీలో నిస్సందేహంగా జోష్ నింపింది. ఎన్నికల నాటికి టీడీపీ, పవన్‌కళ్యాణ్, బీజేపీ ఒక కూటమిగా ఏర్పడతారనే ఊహగానాలకు తెర లేచింది. ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యనేతలు ఆప్యాయంగా చంద్రబాబును ఆ సమావేశంలో పలకరించడం ఆయన ఢిల్లీ పర్యటనలో కొసమెరుపు.

బీజేపీతో సద్భావన కోసం చంద్రబాబునాయుడు ఎంత వ్యూహాత్మకంగా వ్యవహరించారో... చంద్రబాబుతో సయోధ్య కోసం బీజేపీ కూడా అంతే వ్యూహాత్మకంగా వ్యవహరించింది. బీజేపీ అంటే నరేంద్ర మోడీయే కదా!

ఆయన చూపు ఇప్పుడు తెలంగాణ మీద పడిందనే దాంట్లో రహస్యం ఏమీ లేదు. తెలంగాణాలో అధికారం కైవసం చేసుకోవడానికి అవకాశం ఉన్న అన్ని మార్గాలనూ దుర్భిణీ వేసి మరీ బీజేపీ వెదుకుతోంది.

హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలు తెలంగాణకు ఆయువు పట్టు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పాతిక అసెంబ్లీ స్థానాలు, అయిదు ఎం.పీ స్థానాలు ఉంటే దాదాపు 35, 40 లక్షల మంది ఏపీలోని పాత 13 జిల్లాలకు సంబంధించిన తెలుగు వారు నివసిస్తున్నారు.

1956లో ఉమ్మడి రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచీ మొదలుపెట్టి, నిన్న.... మొన్నటి వరకూ ఉపాధి కోసమో, వ్యాపారాల కోసమో, విశ్రాంత జీవితాల కోసమో దేనికో దాని కోసమో వీరంతా తీపి నీటికి చేపలు ఎదురెక్కి నట్టుగా హైదరాబాద్ బాటపట్టారు. ఇక్కడే పుట్టి, ఇక్కడే గిట్టి, ఇక్కడే మట్టి అయిపోతున్నవారు లక్షల్లో ఉంటారు.

అలా, హైదరాబాద్ 'సెటిలర్స్'గా పలువురు టీఆర్ఎస్ నేతలతో పిలిపించుకునే ఆంధ్రావాళ్ళు, సంఖ్యాపరంగా పాతిక ముప్పై నియోజకవర్గాలలో ఫలితాలను ప్రభావితం చేయగల స్థితిలో ఉన్నారు. వీరుగాక ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలు ఆంధ్రవారికి పెట్టింది పేరు. ఖమ్మం వెళ్లి, గాంధీచౌక్ వద్ద నిలబడి, రాయిపైకి విసిరితే.. అది తిరిగొచ్చి ఏ గుంటూరు జిల్లా వారి మీదో... కృష్ణాజిల్లా వారి మీదో పడుతుంది.

ఈ మొత్తం ఓటు బ్యాంకు మీద చంద్రబాబునాయుడు ప్రభావం గణనీయంగా ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ భారీ ఓటు బ్యాంకు మీద బీజేపీ కన్నేసి ఉంచడం వల్లే ప్రధాని నరేంద్ర మోడీ, చంద్రబాబును ఆప్యాయంగా పలకరించారు. అందరూ చూస్తుండగా... పక్కకు తీసుకెళ్లి నవ్వుతూ మాట్లాడారు. ఆంధ్ర బీజేపీకి కూడా స్పష్టమైన సంకేతాలు పంపించారు.

లెక్క ప్రకారం అయితే, ఆంధ్ర ఎన్నికల కంటే తెలంగాణ ఎన్నికలు ముందుగా రావాలి. ఏ ఎన్నికలు ఎప్పుడు వచ్చినప్పటికీ తెలంగాణలో బీజేపీకి చంద్రబాబు ఉపయోగపడితే ఆంధ్రలో చంద్రబాబుకు మోడీ ఉపయోగపడవచ్చు. అందుకే, ఇది ఉభయ తారక మాటా – మంతీ అయింది. ముందు, ముందు ఇద్దరే ఏకాంతంగా సమావేశమయినా ఆశ్చర్యపోవాల్సింది ఏమీ లేదు.

గత నాలుగేళ్లుగా నరేంద్ర మోడీ – చంద్రబాబునాయుడు మధ్య ఏర్పడిన గ్యాప్ వల్ల, రాష్ట్రం ఎంతగానో నష్టపోయింది. నష్టపోవడానికి ఇంకా ఏమీ లేదు అన్నంతగా రాష్ట్రం నష్టపోయింది. అందుకే, ఈ 'కలయిక' పట్ల రాష్ట్రంలో అంత ఆసక్తి వ్యక్తమైంది.

**- భోగాది వేంకట రాయుడు**

# చిన్నబోయిన..'బుల్లి' రాకెట్

## దూసుకెళ్లింది.. కానీ, దిశ మారింది



శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి రాకెట్ ప్రయోగాలు ఇటీవలి కాలంలో బాగా విజయవంతం అవుతుండడంతో బహుశా దిష్టి తగిలిందేమో కాబోలు..మొన్న పంపిన బుల్లి రాకెట్ ఒకటి గతితప్పి దిశ మారింది. తక్కువ ఖర్చుతో చిన్నరాకెట్‌ల ప్రయోగం చేయాలని ఇస్రో శాస్త్రవేత్తలు ఈనెల 7న పంపి ఎస్ఎస్ఎల్వి–డి1 (స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్) రాకెట్‌ను తొలి ప్రయోగంగా అంతరిక్షంలోకి పంపారు. నింగిలోకి రాకెట్ దూసుకుపోయినా దాంతోపాటు పంపిన ఇఓఎస్–02, 'అజాది శాట్' (750 మంది విద్యార్థులు రూపొందించిన బుల్లి ఉపగ్రహా)లను కక్షలోకి ప్రవేశపెట్టిన కొద్దిసేపటికే ఆ ఉపగ్రహాల నుంచి సంకేతాలు అందకపోవడంతో శాస్త్రవేత్తలు ఉత్కంఠకు గురయ్యారు. సాంకేతికపరమైన లోపమెక్కడో జరిగింది. దీంతో ప్రయోగం విజయవంతం కాలేకపోయింది. అయినప్పటికీ ఆ ఉపగ్రహాలను అనుసంధానించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ఇస్రో ఛైర్మెన్ సోమనాథ్ ప్రకటించారు. ఇలాంటి వైఫల్యాలు అంతరిక్ష రంగంలో సాధారణమే. అందులోనూ సరికొత్త రాకెట్‌లు ప్రయోగించే సందర్భంలో పొరపాట్లు సహజం. సాంకేతికపరమైన అంశాలు లెక్కలేనన్ని ఉంటాయి. వాటిలో లోపాలేమైనా ఉంటే గుర్తించి మరింత సమర్ధవంతంగా రాకెట్‌లు ప్రయోగించేందుకు ఇలాంటి వైఫల్యాలు దోహదం చేస్తాయి కనుక శాస్త్రవేత్తలు నిరుత్సాహపడకుండా మరింత పట్టుదలతో తమ కృషిని కొనసాగిస్తున్నారు. గతంలో పలు వైఫల్యాల తర్వాతనే ఇస్రో ఇప్పుడు అసాధారణ స్థాయిలో అనేక రాకెట్ ప్రయోగాలను జయప్రదంగా నిర్వహించి అద్భుతాలు సృష్టిస్తూ, ఎన్నో గగన విజయాలు సాధిస్తూ అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిందనే విషయం అందరికీ తెలిసిందే. ఏదేమైనా ఓటముల నుంచే గెలుపును సాధించుకోవాలి. ఒక బుల్లిరాకెట్ చిన్నబోయిందని చింతించాల్సిన అవసరమే లేదు. వైఫల్యాలను కూడా విజయాలకు మెట్లుగా తీర్చిదిద్దుకొని ముందుకు సాగడమే విజ్ఞుల లక్షణం. ఆ విజ్ఞత–సమర్థత, ప్రతిభాపాటవాలు ఇస్రోకి పుష్కలంగానే ఉన్నాయి..డోంట్ వర్రీ!...



## 'రెడ్‌క్రాస్' పాదయాత్ర

'ఆజాది కా అమృత్ మహోత్సవ్' సందర్భంగా నెల్లూరు గాంధీ విగ్రహం వద్ద నుండి పల్లిపాడు గాంధీ ఆశ్రమం వరకు ఈ నెల 11వ తేదీ గురువారం మువ్వన్నెల జెండాలతో రెడ్‌క్రాస్ నిర్వహించిన 'హెరిటేజ్ వాక్'(14కి.మీ)లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు.







Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com